## రాష్ట్రంలో పది మంది ఎమ్మెల్యేల..

# రాజీనామాలు ఖాయం

- దమ్ముంటే బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని సిఎం రేవంత్ రెడ్డికి సవాల్
- అటూ ఇటు కానీ ఈ కాకులను ఏమనాలని ప్రశ్న..
- తెలంగాణలో త్వరలో ఉపఎన్నికలు
- గద్వాల నడిగడ్డ బిడ్డకు బిఆర్ఎస్ సీట్
- 50వేల మెజారిటీతో గెలిపించాలనీ పిలుపు
- అబద్ధపు హామీలు, అసమర్ధత పాలనలో కాంగ్రెస్
- బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బహిరంగ సభలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**గద్వాల టౌన్ సెప్టెంబర్13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పది మంది ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయడం ఖాయమని, దమ్ముంటే కాంగ్రెస్‌లో చేరిన బిఆర్‌యస్ పార్టీ ఎమ్మెల్యేలను రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు రావాలని సభాముఖంగా సవాల్ చేస్తున్నానని,అటూ ఇటు కానీ ఈ ఎమ్మెల్యేలను ఏమనాలని ప్రజలే చెప్పాలని, పార్టీలు మారడం నియోజక వర్గ అభివృద్ధి కోసం, వారి స్వంత అభివృద్ధి కోసమా, త్వరంలో రాష్ట్రంలో ఉపఎన్నికలు వస్తాయని ఈ ఉప ఎన్నికల్లో గద్వాల సీటు నడిగడ్డ బిడ్డకు ఇచ్చి కేసీఆర్ పంపుతారని, 50 వేల మెజార్టీ తో గెలిపించాలని బిఆర్ యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం గద్వాల తేరు మైదానంలో ఏర్పాటు చేసిన గద్వాల గర్జన బారి బహిరంగ సభలో కల్వకుంట్ల తారక రామారావు మాట్లాడుతూ సమాజంలో రెండు లింగాలను చూశాం కానీ అటూ ఇటు కానీ ఈ ఎమ్మెల్యేలను ఏమనాలో ప్రజలే నిర్ణయించాలన్నారు.గద్వాలలో ఆనాడు కేసీఆర్ సారథ్యంలో బిఆర్ యస్ పార్టీ నుండి గెలిచిన ఈ ప్రాంత ఎమ్మెల్యే ఇప్పుడు నియోజక వర్గ అభివృద్ధి కోసం పార్టీ మారాడా లేకతన స్వంత అభివృద్ధి కోసం పార్టీ మారాడా ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చింది కెసిఆర్ కాదా అన్నారు.కరోనా సమయంలో కూడా రైతుబంధు, కళ్యాణ లక్ష్మీ,పెన్షన్లు, కెసిఆర్ కిట్ తదితర పతకాలను కూడా కేసీఆర్ విజయవంతంగా కొనసాగించారని, ఎన్నడు ప్రజలను ఇబ్బందులకు గురివించేయలేదన్నారు.ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన్ హామీలను నెరవేర్చేందుకు కాకమ్మ కథలు చెబుతున్నారని, ఇదొక అసమర్థత, చేతకాని దొంగా ప్రభుత్వం అని మండిపడ్డారు. గద్వాల నియోజక వర్గంలోగట్టు,అల్లంపూర్ నియోజకవర్గం లో తుమ్మిళ ప్రాజెక్టులకు నిధులు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే గుర్తుచేశారు. కేసీఆర్ అభివృద్ధి పథకాలకు కాంగ్రెసోళ్ళు తమ పెరు చెప్పుకోవటానికి సిగ్గు ఉండాలని వారన్నారు. దీనికి గత శనివారం గద్వాలలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ నిదర్శనం అని అన్నారు. ముగ్గురు రాష్ట్ర మంత్రులు వచ్చి సొమ్ము ఒకరిది సోకు ఒకరిది అన్నట్టుగాఅబద్దాల అభివృద్ధి చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.రాష్ట్రంలో జిల్లాల ఏర్పాటు కేసీఆర్ ఘనతే అనిఅందులో భాగంగానే జిల్లా కార్యాలయాలు, నర్సింగ్ కళాశాల, మెడికల్ కళాశాలలు మీ జిల్లాలకు వచ్చాయని కేటీఆర్ అన్నారు. ప్రాజెక్టుల అభివృద్ధికి 581కోట్ల రూపాయలనుఅప్పటి బిఆర్‌యస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. నియోజకవర్గంలో గట్టుఎత్తిపోతల ప్రాజెక్టు బిఆర్‌యస్ ప్రభుత్వంలో 45శాతం పనులు పూర్తి చేశామన్నారు. ఇప్పుడు వున్న ఇక్కడి ఎమ్మెల్యే గతంలో రైలు కింద తలైన పెడుతాను కానీ కాంగ్రెస్ పార్టీలో చేరను అన్నఈ ఎమ్మెల్యేను నమ్మాలఅని ప్రశ్నించారు.రాబోయే ఏఎన్నికలో అయినా బిఆర్ఎస్ ను ఆదరించాలని ,మళ్ళీ కేసీఆర్‌ను సీఎంగా చూడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

**చివరి శ్వాస వరకు కేటీఆర్ సారథ్యంలోనే సాగుతా : మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్...** గద్వాల బహిరంగ సభలో కేశవ్ మాట్లాడుతూ నాలో శ్వాస వున్నంత వరకు కేటీఆర్ సారథ్యంలోనే కొనసాగుతానని, నియోజక వర్గంలో ఎంతటి వారినైనా ఓడించడానికి బిఆర్ యస్ పార్టీ వెంట ఉంటానని వారు అన్నారు. గతంలో కూడా ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే ను గెలిపించడానికి ఆరోజు కేటీఆర్ ఫోన్ చెప్పినందుకే కేటీఆర్ మాటకోసం గెలుపుకు కృషి చేశానని వారు అన్నారు.

**బిఆర్ఎస్ పార్టీలో చేరికలు...**

గద్వాల గర్జన భారీ బహిరంగ సభలో కేటీఆర్ సమక్షంలో గద్వాల నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ నుండి భారీగా చేరికలు జరిగాయి. బిఆర్‌యస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో గద్వాల మాజీ మున్సిపల్ ఛైర్మన్ బీఎస్ కేశవ్, ధరూర్ మండల మాజీ జెడ్పీటీసీ పద్మ వెంకటేశ్వర రెడ్డి, వీరితో పాటు పది మంది గద్వాల పట్టణ మాజీ కౌన్సిలర్లు,పలు మండలాల మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు బారి సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.

**రాబోయే తరానికి కాబోయే సీఎం కేటీఆర్ : బాసు హనుమంతు నాయుడు..** బిఆర్‌యస్ పార్టీ గద్వాల నియోజకవర్గం ఇంచార్జీగా బాసు హనుమంతు నాయుడు, ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గద్వాల గర్జన బారి బహిరంగ సభ ద్విగ్విజయంగా సాగింది. బాసు హనుమంతు మాట్లాడుతూ రాబోయే తరానికి కాబోయే సీఎం కేటీఆర్ అని ప్రసంగించారు. ఇప్పటికీ ఇప్పుడు గద్వాల లో ఎమ్మెల్యే ఎన్నికలు జరిగితే 60వేల మెజార్టీ తో బిఆర్ యస్ పార్టీ అభ్యర్థినీ గెలిపిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలు తెలుసు అని కాంగ్రెస్ నాయకులను నమ్మే పరిస్తితి ఇక్కడి ప్రజలకు లేదని వారన్నారు. బిఆర్‌యస్ పార్టీ నుండి గెలిచిన ఇక్కడి ఎమ్మెల్యే బిఆర్‌యస్ పార్టీకి దూరం అయితే ఆ రోజు నుండి పార్టీ ఒక్క జెండాను పట్టుకునీ,పార్టీని నమ్ముకుని ఈ రోజు వేల జెండాలను తయారు చేశానని అన్నారు. ఇకముందు గద్వాలలో బిఆర్ యస్‌పార్టీకి తిరుగు లేదనిధీమా వ్యక్తం చేశారు. బహిరంగ సభలో ఆంజనేయులు గౌడ్ మాట్లాడతూ ఇక్కడ ఒక ఎపిసోడ్ నడుస్తుందని, ఈ ఎపిసోడ్ కు దర్శకత్వం, నిర్మాత, రచయిత అన్ని మామ అయితే ఆయన సారథ్యంలో అల్లుడు స్వాతి ముత్యం లా పని చేస్తాడు, అత్త ఆణి ముత్యం లా పని చేస్తుందని ఎద్దేవా చేశారు. ఇక వారి నాటకాలు నడిగడ్డలో నడవవు అని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెపుతారని ఆయన అన్నారు.ఈ సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అల్లంపూర్ ఎమ్మెల్యే విజయులు,చల్లా వెంకట్ రామ్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, పాడికౌశిక్‌రెడ్డి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు,విజయకుమార్,బాసుశ్యామల, అమరవాయి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు ఆల వెంకటేశ్వర రెడ్డి, అంజయ్య, రజనీ తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభకు హాజరైన ప్రజలు, బిఆర్ఎస్ నాయకులు



కేటీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్న మాజీ మున్సిపల్ ఛైర్మన్ బీఎస్ కేశవ్

# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## డిండికి నీటి తరలింపును అడ్డుకుంటా..

### - మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం రిజర్వాయర్‌కు గండికొట్టి సుమారు 50 టీఎంసీల నీటిని డిండి ప్రాజెక్టుకు తరలించేందుకు ప్రభుత్వం జీవోను విడుదల చేయడం చేశారని, తన ప్రాణాలను అడ్డంగా పెట్టైనా నీటి తరలింపును అడ్డుకుంటానని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత డాక్టర్ నాగం జనార్దన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో 36 లక్షల ఎకరాలు సాగుభూమి ఉండగా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వివిధ ప్రాజెక్టు నుండి సుమారు 7 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందని మండిపడ్డారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో 3 మోటర్లు మాత్రమే పనిచేస్తున్నాయని, 2మోటార్లు కాలిపోయి 2 సంవత్సరాలు అవుతున్న ఎందుకు కొత్తవి బిగించ లేదని ఆయన ప్రశ్నించారు. కెఎల్ఐ సమీపంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించే సందర్భంలోనే తాను హెచ్చరించడం జరిగిందని గుర్తు చేశారు. నల్లమల్ల బిడ్డగా నిత్యం జపించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలో మూడున్నర కిలోమీటర్ల పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తిచేస్తే పలు రిజర్వాయర్లు నిండి రైతులకు సాగునీరు అందలేదని అన్నారు. రాష్ట్రంలో రాజకీయాలను వ్యాపారమయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలం ద్వారా డిండి నీటిని తరలిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా తరలిస్తే సహించేది లేదన్నారు. నల్లగొండ జిల్లాకు ఇప్పటికే వివిధ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందుతుందని తమ నోట్లో మట్టి కొట్టొద్దని కోరారు.

రాజకీయాలకు అతీతంగా అక్రమ నీటి తరలింపు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు అర్థం రవి బాలాగౌడ్ తిమ్మా జీపేట పాండు, లక్ష్మయ్య, సత్యం భీముడు అహ్మద్ వెంకటేష్ విష్ణు సుధాకర్ రాజు తదితరులు ఉన్నారు.

## గ్రూప్-1 పరీక్షను రద్దు చేయాలి

- రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన నిరుద్యోగులు
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, నిరుద్యోగ యువత

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు శాపంగా మారిందని, హైకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా గ్రూప్-1 పరీక్షను రద్దు చేయాలని, గ్రూప్-1 పరీక్షకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని నిరుద్యోగులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రూప్-1 పరీక్షను రద్దు చేయాలని సూచిస్తూ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, నిరుద్యోగులు మాట్లాడుతూ జీవో నెం 29 రద్దు చేయాలని, జీవో నెం 55 ఇంప్లిమెంటేషన్ చేయాలని వారు డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పినట్టుగా అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో జ్యూడిషియల్ కమిషన్ ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనేక సెంటర్లో అక్రమాలకు జరిగినట్లు నిరుద్యోగులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ టీజీపీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఆ రోజు సమైక్య రాష్ట్రంలో నాటి కమీషన్ చైర్మన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్యాయం జరిగిందని పోరాటం చేశామని, ఇప్పుడున్న కమీషన్ అదే విధానాన్ని అనుసరించటం వల్ల గ్రూప్-1 అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, ఇప్పటికైనా ప్రభుత్వం పట్టింపులకు పోకుండా హైకోర్ట్ డివిజన్ బెంచికి మరియు సుప్రీంకోర్టుకి వెళ్లవద్దని అభ్యర్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ అతినారపు విష్ణు సాగర్, నాయకులు జానకిరామ్, పాలమూరి శివ, రమణ, వంశీగౌడ్, మానపాడు రవిందర్, అఖిల్ గౌడ్, ప్రశాంత్, సైఫుద్దీన్, బెక్కరి శివ, దుడ్డు బాలు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గం ద్వారా కేసుల పరిష్కారం

- ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు

**నారాయణపేట, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** రాజీ మార్గం ద్వారానే కేసుల పరిష్కారమని ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. శనివారం జాతీయ న్యాయ సేవాధికార ఆదేశాలకు నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యంలో నారాయపేట జిల్లా ప్రాంగణంలో 4 బెంచులను ఏర్పాటు చేసి, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కం చైర్మన్ నారాయణపేట బోయ శ్రీనివాసులు, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్,జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే.అవినాష్ హాజరై కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌లో అన్ని కోర్టు పరిధిలో 5581కేసులను రాజీ మార్గం ద్వారాపరిష్కరించారు. జిల్లాలో 14 పోలీస్ స్టేషన్లతో పాటు రెండు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల కోస్గి, నారాయణపేట పరిధిలో ఉన్న కేసులకు న్యాయవాదులు సహకరించి పరిష్కారానికి కృషి చేశారు.కాగా మొత్తంకేసుల పరిష్కారానికిగానురూ 22,17,956/ ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందని ప్రధాన న్యాయమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కే. కురుమన్న గౌడ్, కె.సత్యరాయణ గౌడ్, వినోద్ కుమార్, సురేంద్ర చారి న్యాయవాదులు, కక్షి దారులు, పోలీసులు పాల్గొన్నారు.

## ఆ కరోనా బీర్లు ఎక్కడివి..?

### స్టాక్ తీసుకోలేదని తెలిపిన అధికారులు

**జడ్చర్ల, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** జడ్చర్లలోని ఓ వైన్స్‌లో ఈనెల 7న గడువు ముగిసిన బీర్లు విక్రయించడంతో అవి తాగి స్వల్ప స్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. విషయం ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియడంతో రంగంలోకి దిగారు. గడువు ముగిసిన బీర్లు ఎందుకు విక్రయించాలని ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్లు చెక్ చేశారు. ఐదారు నెలల స్టాక్ ను పరిశీలించారు. అసలు ట్విస్ట్ ఇక్కడే ఉంది.. జడ్చర్ల లోని వెంకటేశ్వర వైన్స్‌లో అసలు కరోనా బీర్లు కొనుగోలు చేసినట్లు ఎలాంటి ఆధారాలు ఇప్పటికీ దొరకలేదని ఎక్సైజ్ సిఐ విప్లవ రెడ్డి తెలపడం గమనార్హం. వినియోగదారుడు కొనుగోలు చేసిన కరోనా బీర్లు గత ఏడాది డిసెంబర్‌తోనే గడువు ముగిశాయి. 8 నెలల కిందట గడువు ముగిసిన బీర్లను విక్రయించడం గాక ఆ బీర్లు సదరు వైన్ షాప్‌లో కొనుగోలు చేస్తున్నట్లు ఎలాంటి సమాచారం లేకపోవడం మరొక ట్విస్ట్. అయితే ఆ కరోనా బీర్లు ఎక్కడినుంచి తీసుకొచ్చారు .. ఇంకా అంత చిక్కని ప్రశ్న గానే మిగిలింది.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది

- ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమ నిధికి రు.10లక్షలు
- పాలమూరు యూనివర్సిటీలో జిల్లాకు చెందిన విద్యార్థులే అధికంగా ఉండాలి
- ట్రిపుల్ ఐటీ, ఇంజనీరింగ్ కోర్సులను జిల్లా విద్యార్థులు వినియోగించుకోవాలి
- ట్రస్మా అవార్డుల మహోత్సవంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూధన్ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న గొడుగు వెంకటయ్య, కాడ్లూర్ చాముండేశ్వరి



అవార్డుల ఫంక్షన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్,సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని,అక్షరాస్యతను సాధించడంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యాభివృద్ధికి ఎంతో సహకరిస్తు విద్యలో కీలక పాత్రను పోషిస్తున్నాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.శనివారం తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా)జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి సమీపంలోని ఎస్ఎన్ గార్డెన్‌లో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బి లక్ష్మణ్ అధ్యక్షతన ఏర్పాటైన ట్రస్మాలోని ఆయా పాఠశాలల ఉత్తమ కరస్పాండెంట్లు,ఉత్తమ ఉధ్యాయుల అవార్డుల మహోత్సవానికి ఎమ్మెల్యే యెన్నం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ మహోత్సవానికి అతిథులుగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూధన్,ట్రస్మా రాష్ట్ర సలహాదారు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి హర్ష వర్ధన్‌రెడ్డి,జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ మల్లునర్సింహ్మారెడ్డి,మహబూబ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్‌ఆనందకుమార్‌గౌడ్‌లు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల మనుగడను కాపాడుకోవడంలో ఆయా పాఠశాలల యాజమాన్యాలు కృషిచేయాలని సూచించారు.జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల,త్రిపుల్ ఐటీ కళాశాలలు మంజూరయ్యాయని,ఇందులో వెనకబడిన పాలమూరు జిల్లాకు చెందిన విద్యార్థులు చేరి ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.కోవిడ్ సమయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎంతో కష్టనష్టాలకోర్చి తమపాఠశాలల్ని నడిపించారని,చాలా మంది చేసిన అప్పుల బాధతో పలు ఇబ్బంధులనెదుర్కొన్నారని ఎమ్మెల్యే యెన్నెం అన్నారు.

**ప్రైవేట్ టీచర్ల సంక్షేమ,భవిష్యనిధికి రు.10లక్షలు**

ప్రైవేట్ పాఠశాలల్లో చాలీచాలని తక్కువ జీతాలతో టీచర్లు కాలాన్ని వెళ్లధీస్తూ జీవితాలను నెడుతున్నారని,వీరి సంక్షేమం కోసం ట్రస్మా యాజమాన్యాలు సంక్షేమ భవిష్యనిధినేర్పాటు చేయాలని ఎమ్మెల్యే యెన్నెం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను కోరారు.ప్రైవేట్ టీచర్ల సంక్షేమ నిధి,భవిష్యనిధి కోసం తాను రు.10లక్షలు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నెం ప్రకటించారు.జిల్లాలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు తమ వద్ద పనిచేస్తున్న ఉపాధ్యాయుల జీతంలో ప్రతీనెల రు.250లు కటచేసి దీనికి రు.250లు జమచేసి ఆ టీచర్ పేరుమీద రు.500లు సంక్షేమ నిధికి జమచేయాలని సూచించారు. ప్రైవేట్ టీచర్‌కు ఏకష్టమొచ్చినా ఎవరిని అడిగే పనిలేకుండా సంక్షేమ నిధి నుంచి తీసి ఇవ్వొచ్చు ని అన్నారు.అంతకు ముందు ఎమ్మెల్యే యెన్నెంజ్యోతి ప్రజ్వళన చేసిఅవార్డుల ఉత్సవాలను ప్రారంభించారు. మారుతున్న కాలానికనుగుణంగా ప్రైవేట్ పాఠశాలల్లో డిజిటల్ విద్యావిధానాన్ని అమలు చేయాలని ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానం అమలౌతోందని,ప్రైవేట్ పాఠశాలలో డిజిటల్ విద్యా విధానం లేకపోతే ప్రైవేట్ పాఠశాలల మనుగడకు కొంత నష్టం కలిగే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**అజ్ఞానాంధకారాన్ని తొలగించే సుజ్ఞాన కిరణాలు ఉపాధ్యాయులు...**
**- ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సామల మధుసూధన్‌రెడ్డి**

సమాజ మార్పుకుఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉపయోగపడుతుందని,అజ్ఞానాంధకారాన్ని తొలగించే సుజ్ఞాన కిరణం విద్య అని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూధన్ అన్నారు.రాష్ట్రంలో 60 శాతం విద్య ప్రైవేట్ స్కూల్స్ ద్వారానే జరుగుతోందని స్పష్టం చేశారు. ఇందుకు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఇందులో పనిచేసే ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. పరోక్షం గాను ,ప్రత్యక్షంగాను విద్యాభి వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరి స్తున్న ట్రస్మాను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూధన్అన్నారు.ప్రైవేట్ పాఠశాలల మనుగడను కాపాడేందుకు రాష్ట్ర ట్రస్మా ఎల్లవేళలా కృషిచేస్తుందన్నారు. ప్రతి జిల్లాలో ట్రస్మా భవన్ ఏర్పాటుకు రాష్ట్ర బాధ్యులతో పాటు జిల్లా బాధ్యులు తోడ్పాటు నివ్వాలని సూచించారు.రాష్ట్రంలో 11వేల 500 ప్రైవేట్ పాఠశాలలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని,64లక్షల మంది విద్యార్థిని విద్యార్థులు ప్రైవేట్ బడుల్లో చదువుతున్నారన్నారు.ప్రైవేట్ పాఠశాలల భవనాలకు టాక్స్‌లురద్దు చేయాలని ఆయన కోరారు. విద్యాభివృద్ధిలో ప్రైవేట్‌పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు.

**ట్రస్మాకు ప్రతి జిల్లాలో ఓ సొంత భవనం ఉండాలి...**
**-ట్రస్మా రాష్ట్ర సలహాదారు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి**

ట్రస్మాకు ప్రతి జిల్లాలో ఓ సొంత భవనం ఉండాలని,తన వంతు సహకారంగా రు.75వేలు ఇస్తున్నానని ట్రస్మా రాష్ట్ర సలహాదారు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి ప్రకటించారు.ప్రతీ ఏటా ట్రస్మా జిల్లా భవన్‌లోనే ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు,కరస్పాండెంట్లకు సన్మానాలుండాలని ఆయన సూచించారు.

**అందరి సహకారంతో ట్రస్మా ముందడుగు...**
**-ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్**

జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు,పీఎస్టీల సహకారంతోనే ట్రస్మా జిల్లాశాఖ ముందడుగు వేస్తోందని,అందరి కోరిక మేరకే తాను నాలుగుమార్లు జిల్లా అధ్యక్ష పదవిని చేపట్టానని అవార్డుల ఉత్సవానికి అధ్యక్షత వహించిన ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బి లక్ష్మణ్ అన్నారు. జిల్లాలో దాదాపు 150వరకు పాఠశాలలు ట్రస్మాలో ఉన్నాయని,కరస్పాండెంట్లతో పాటు దాదాపుగా రెండువేల మంది ఉపాధ్యాయులు ట్రస్మాలో కుటుంబ సభ్యులుగా ఉన్నారని లక్ష్మణ్ స్పష్టం చేశారు.స్థానిక ఎమ్మెల్యే యెన్నెం విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తున్నారని,విద్యాభి వృద్ధిలో ప్రభుత్వానికి సహకరిస్తున్న ప్రైవేట్ పాఠశాలల మనుగడకు ఎమ్మెల్యే యెన్నెం తన వంతు సహకారమందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అనుసంధాన కర్తగా ట్రస్మా పట్టణ అధ్యక్షుడు వంశీమోహన్‌రెడ్డి వ్యవహరించారు.ఇంకా ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంత్రి కుమార్,ట్రస్మా జిల్లాసలహాదారు లక్ష్మణ్‌గౌడ్‌తో పాటు పలు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు వెంకటయ్య, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి,నరేందర్‌జీ,రాజేందర్‌రెడ్డిలు ప్రసంగించగా, ఇతరకరస్పాండెంట్లు సత్యనారాయణ,గొడుగు వెంకటయ్య,రమేష్ గౌడ్,ఆనంద్,సాగర్,కృష్ణమోహన్, చారి, శివకుమార్, చందు రాఘవేందర్ ఇతర కరస్పాండెంట్లు,ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉత్తమ కరస్పాండెంట్,ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎమ్మెల్యే యెన్నెం చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ దంపతులు

## కళాశాల ప్రతిష్టను పెంచండి..

- విద్యాబోధన,వసతులు, భోజనం ఎలా ఉందంటూ ఆరా
- త్రిపుల్ ఐటీ కళాశాల విద్యార్థులతో ముచ్చటించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ ఐఐటి కళాశాలలో వసతులు ఎలా ఉన్నాయని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం ఆకస్మికంగా ఐఐటి కళాశాలను సందర్శించి, హాస్టల్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎక్కడి నుంచి వచ్చారని, పదవ తరగతిలో మార్కులు ఎన్ని వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో భోజనం ఎలా ఉందని అడగగా, ఇంటి భోజనం మాదిరిగా ఉందని వారుచెప్పారు. లెక్చరర్స్ పాఠ్యాంశాలు ఎలా బోధిస్తున్నారు? అర్థం అవుతుందా? అని ఆయన అడిగారు. లెక్చరర్స్ మంచిగా బోధిస్తున్నారని, పాఠ్యాంశాలు చాలా బాగా అర్థం అవుతున్నాయని విద్యార్థులు ఎమ్మెల్యేతో చెప్పారు. సమయాన్ని వృధా చేయకుండా, కలిసిమెలిసి ఉండాలని, మంచిగా చదువుకొని మహబూబ్‌నగర్ ఐఐటి కళాశాల ప్రతిష్టను మరింత పెంచాలని ఆయన విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ఐఐటి కళాశాల ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు లీడర్ రఘు, యాదిరెడ్డి, రెడ్డి సేవా సంఘం సభ్యులు సురేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు 20 లక్షల నష్ట పరిహారం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన సందర్భంగా శనివారం మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డిలు కలిసి కృతజ్ఞతలు తెలియజేసి ముఖ్యమంత్రిని శాలువాతో సన్మానించారు.అనంతరం వారు మాట్లాడుతూ త్వరితగతిన భూసేకరణ ప్రక్రియ ముగిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి,ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి, నారాయణపేట మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రికి చెప్పారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

## పాలమూరు ప్రజలు కేటీఆర్‌ను పట్టించుకోరు

● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారు
● దేవరకద్ర ఎమ్మెల్యే జీ. మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** కేటీఆర్ ప్రవర్తనను ప్రజలు అసహించుకుంటున్నారు, పాలమూరు ప్రజలు కేటీఆర్ ను పట్టించుకోరు అని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారు అన్నారు. టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరు చూస్తుంటే జాలి వేస్తుందన్నారు. దోచుకున్న సొమ్ము పంపకాలలో తేడాలు రావడంతో కుటుంబ కలహాలు ఏర్పడి, కేటీఆర్‌కు మతి భ్రమించిందన్నారు. పాలమూరుకు ఏం మొహం పెట్టుకుని వస్తున్నావు కేటీఆర్, పాలమూరు జిల్లా కేసీఆర్ ను ఎంపీగా గెలిపించి, రాజకీయ భవిష్యత్తు ఇస్తే పదేళ్ల మీ పాలనలో పాలమూరుకు అన్యాయం చేశారన్నారు. 2015 నాడు మీ నాన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టునుమూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పి, పదేళ్ల పాలనలో పాలమూరును పూర్తి చేయలేదన్నారు. సొంత పేపర్, సొంత చానల్లో డబ్బా కొట్టుకోవడం తప్ప, కేటీఆర్ కు అంత సీన్ లేదన్నారు. పాలమూరు జిల్లాలో కేటీఆర్ ను ఎవరు పట్టించుకోరు. అసెంబ్లీ లోకసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడించిన కేటీఆర్‌కు బుద్ధి రాలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల, అలంపూర్ లలో స్థానిక నాయకుల బలంతోనే గెలిచారు తప్ప పాలమూరులో పూర్తిగా బిఆర్ఎస్ తుడిచి పెట్టుకు పోయిందన్నారు. పదేళ్ల పాలనలో జూరాలను గాలికి వదిలివేస్తే, మా ప్రభుత్వం 120 కోట్లతో జూరాల పైన కొత్త బ్రిడ్జిని నిర్మిస్తుంది. పార్టీ ఫిరాయింపులపై కేటీఆర్ తీరు ప్రతివత పరమాన్నం వండితే తెల్లరే వరకు చల్లారినట్లుగా ఉంది. పదేళ్ల రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్ష పార్టీలను పట్టపగలు ఖునీ చేసిన నీచులు, పార్టీలకు పార్టీలను మింగేసిన బకాసురులు, మీరు పార్టీ ఫిర్యాంపుల పైన కేటీఆర్ ఏం మాట్లాడినా ఉపయోగం లేదన్నారు. జనం మిమ్మల్ని క్షమించరు కేటీఆర్ అని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు.

## న్యాయమే ధర్మం.. ధర్మమే ప్రజల బలం

● దేవరకద్ర ఎమ్మెల్యే జీ. మధుసూదన్ రెడ్డి



ప్రజల కోసం పోరాడే న్యాయవాదిగా ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

**దేవరకద్ర, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** న్యాయం ఆలస్యమైతే అది అన్యాయం అవుతుంది. కానీ న్యాయవాది ధైర్యమైతే అది ఆశగా మారుతుంది. న్యాయస్థానం గౌరవాన్ని నిలబెట్టి, నిజానికి అండగా అణగారిన వాణ్ణి కాపాడడానికి అన్యాయాన్ని ఎదిరించడానికి ముందడుగు వేసే న్యాయవాది దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి. ప్రజల న్యాయం కోసం పోరాడే ప్రతి అడుగు చరిత్రలో ఒక ముద్ర వేస్తుంది. న్యాయమే ధర్మం ధర్మమే ప్రజల బలం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి. న్యాయాన్ని పాటించడం ద్వారా ప్రజలు బలంగా మారుతారు. ఎందుకంటే ధర్మము అనేది సమాజానికి పునాది వంటిది అని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు.

## రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కిరణ్‌కు సన్మానం

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్‌ను శనివారం నారాయణపేట జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు హైద్రాబాద్‌లో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. జిల్లా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.విజయ్ కుమార్, అధ్యక్షులు కృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులను శాలువాతో పూల మాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆశప్ప బాబు, జిల్లా నాయకులు లక్ష్మణ్, భీమ్‌రాజ్, సురేష్, గజేంద్ర, ఆంజనేయులు, నరసింహ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో బిజెపి ఎస్సీల్లో ముందుకు దూసుకుపోయి బిజెపి మరింత పటిష్టం అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు.

## పేదల ఆరోగ్య సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**అమరచింత సెప్టెంబర్13,ప్రభాతవార్త;** పేదల ఆరోగ్య సంక్షేమ ప్రభుత్వ ధ్యేయంగా ముందుకెళుతుందని అమరచింత పట్టణ కాంగ్రెస్, అధ్యక్షులు అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం అమరచింత మండల తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయని దీపతకం పేదలకు దేవుడిచ్చిన వరమని వారు అన్నారు. అమరచింత మండలంలోని 12 గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశామని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి, కల్లు గీత డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్ డైరెక్టర్లు విష్ణు, మోహన్, శ్యాం కుమార్, మాజీ ఎంపిటిసి, తిరుమలేష్, రాకేష్ గౌడ్ బిసి రెడ్డి, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, శివ, శ్రీధర్ రెడ్డి, రాజసింహారెడ్డి, ధర్మపురం ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నాయి గోవర్ధన్



**దేవరకద్ర, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నాయి గోవర్ధన్‌కు నియామక పత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, దేవరకద్ర పేదల పెన్నిధి దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం నియామక పత్రాన్ని అందజేశారు. నాయి గోవర్ధన్‌ను జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాయి గోవర్ధన్ మాట్లాడుతూ నా మీద నమ్మకముంచి ఇంత మంచి అవకాశం ఇచ్చినందుకు నేను ఈ అవకాశాన్ని సక్రమంగా వినియోగిస్తానని, కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తానని, కాంగ్రెస్ పార్టీ కార్య క్రమాలు, కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించి, కాంగ్రెస్ పార్టీ బలోపే తానికి కృషి చేస్తానని నాయి గోవర్ధన్ హామీ ఇచ్చారు. ఈ ఎంపికకు సహకరించిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సివాంత్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్‌అధ్యక్షులు అవేజ్ అహ్మద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## 24న సీల్డ్ కవర్ టెండర్లు

**చిన్న చింతకుంట, సెప్టెంబరు 13 ప్రభాతవార్త :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు దీపావళి అమావాస్య నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ బ్రహ్మోత్సవాలకు గాను సీల్డ్ కవర్ కొటేషన్స్, ఫ్లవర్ డెకరేషన్, ఆలయాలకు రంగులు వేయుట, చలువ పందిళ్లు, ప్రింటింగ్ మెటీరియల్స్, టెంటు సామాగ్రి, పూజా సామాగ్రి, సీసీ కెమెరాలు ఏర్పాటుకు గాను ఈనెల 24న సీల్డ్ కవర్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో మదేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సీల్డ్ కవర్ టెండర్లను ఉదయం 11 గంటలకు ఓపెన్ చేయబడతాయని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న టెండర్ దారులు ఈనెల 24 తేదీ 10 గంటల లోపు దేవస్థాన కార్యాలయం లో ఏర్పాటుచేసిన డ్రాప్ బాక్స్ లో వెయ్యాలని ఆయన తెలిపారు. సీల్డ్ కవర్ టెండర్‌లో పాల్గొనే పాటదారులు ఈనెల 15న దేవస్థాన కార్యాలయంలో రూ.300 చెల్లించి టెండర్ షెడ్యూల్ ఫారం పొందాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు9701644244, 8897483788 లకు ఫోన్ చేయాలని ఈవో తెలిపారు.

## మక్తల్ మార్కెట్ నూతన కార్యదర్శిగా భారతి నియామకం

**మక్తల్ టౌన్ ,సెప్టెంబరు 13 ప్రభాతవార్త :** :మక్తల్ మార్కెట్ నూతన కార్యదర్శి ఇంచార్జిగా భారతి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ శుభ సందర్భంగా మక్తల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధా లక్ష్మారెడ్డి మరియు వైస్ చైర్మన్ గణేష్ కుమార్ కార్యాలయ సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో కార్యదర్శి భారతి మాట్లాడుతూ మక్తల్ మార్కెట్‌ను అభివృద్ధి పథంలో తేవడానికి కృషి చేస్తానని తెలియజేశారు. సన్మాన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాధా లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కమిటీ డైరెక్టర్లు శ్రీనివాసులు, రంజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, టీ.నాగరాజు, శాలంబిని ఉమార్, మొహమ్మద్ ఫయాజ్, ఆంజనేయులు, బాలప్ప, మహేష్, జనార్దన్ గుప్తా, నాగప్ప, గుర్లపల్లి రాములు, కార్యాలయ సిబ్బంది సూపర్ వైజర్ లింగప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

### స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపిని గెలిపించాలి : గద్వాల జిల్లా బిజెపి అధ్యక్షులు రామాంజనేయులు



మాట్లాడుతున్న జిల్లా బిజెపి అధ్యక్షులు రామాంజనేయులు

**ఇటిక్యాల సెప్టెంబర్ 13, ప్రభాతవార్త;** భారత ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో 11 సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలపై ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని అలాగే సెప్టెంబర్ 17న దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా పక్షం రోజులపాటు గ్రామాలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై అవగాహన కల్పించాలని జోగులాంబ గద్వాల జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు రామాంజనేయులు బిజెపి పార్టీ కార్యకర్తలకు సూచించారు. శనివారం ఎర్రవల్లి మండల పరిధిలోని కోదండపురం గ్రామంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులు జగదీశ్ రెడ్డి. జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేరెడ్డి ఆధ్వర్యంలో సేవా పక్వాడ్ కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు రామాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ పాలనలో భారతదేశం సురక్షితంగా ఉందని స్వాతంత్రం వచ్చి కాంగ్రెస్ పాలనలో 60 ఏళ్లకు పైగా పాలించిన ఎలాంటి అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందలేదని ప్రధాని పాలనలో 11 సంవత్సరాల పాటు గ్రామీణ ప్రాంతాలలో చేసిన అభివృద్ధి పనులలో 90 నిధులు కేంద్ర ప్రభుత్వానివేనని గుర్తు చేశారు. రైతులకు. మహిళలకు. యువతకు అన్ని వర్గాల ప్రజలకు అనేక రకాల సంక్షేమ పథకాలు కేంద్ర ప్రభుత్వం నుండి అందుతున్నాయని ప్రపంచ దేశంలో భారతదేశం మూడవ అతిపెద్ద రాష్ట్రంగా ఏర్పడుతుందని ఆపరేషన్ సింధూర్ కార్యక్రమంతో పాకిస్తాన్ దేశానికి తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. ఇదే సందర్భంగా ఇటిక్యాల మండల పరిధిలోని ఉదండాపురం గ్రామంలోని జిల్లా బిజెపి పార్టీ కార్యవర్గ సభ్యులు తిమ్మారెడ్డి నివాసంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా ఆధ్వర్యంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు సేవా పక్వాడ్ కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి స్వప్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి స్వప్న మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వంలో భారతదేశం ఆర్థికంగా వెనుకబడి ఉండగా నరేంద్ర మోడీ పాలనలో 4వ స్థానానికి చేరుకుందని గ్రామాలలో అభివృద్ధి చేసిన పనులలో కేంద్ర ప్రభుత్వ నిధులు 90శాతం మేర నిధులు మంజూరు అయ్యాయని ఆ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో గతంలోని ప్రజాప్రతినిధులు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఏడాదికి రైతులకు 6 వేల రూపాయలు. ఉచితంగా తెల్ల కార్డు దారులకు బియ్యం పంపిణీ. అందిస్తుందని అలాగే రైతులకు యూరియాను సబ్సిడీపై అందిస్తుండగా కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యూరియా అందించకుండా సింగిల్ విండోల వద్ద క్యూలో నిలుచొని రైతులు యూరియా దొరకక అవస్థలు పడుతున్నారని ప్రభుత్వం గ్యారెంటీలను ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయడం లేదని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా అన్ని పథకాలలో స్కాములుగా మిగిలిపోయారని వివరించారు. ఈనెల 17వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. అంతేకాక త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించేలా ప్రతి నాయకుడు కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు. పరశురాం నాయుడు. వెంకటరామిరెడ్డి. శివరాంరెడ్డి. విజయ్. నరేష్. మహేష్. బీసన్న. రవి. షాలు. వీరన్న. వెంకటేష్. పరుష. రాఘవేంద్ర. తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి కే. విజయ రాములు

**అమరచింత సెప్టెంబర్ 13,ప్రభాతవార్త;** సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కె విజయరాములు మండల కార్యదర్శి అబ్రహం డిమాండ్ చేశారు. శనివారం అమరచింత పట్టణంలో సిపిఐ మండల కమిటీ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం బాధాకరమన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటాన్ని నడిపింది కమ్యూనిస్టులు అని గుర్తు. గత ప్రభుత్వం సెప్టెంబర్ 17న అధికారికంగా నిర్వహిస్తామని అధికారంలోకి వచ్చాక ఆ మాటే మరిచిపోయారని ఆరోపించారు. ఇప్పుడైనా కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17న అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం యూరియా కొరత పై వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. యూరియా కొడతాను రెండు రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. యూరియా లేఖ రైతులు ఆగమవుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తూ ఉండడం బాధాకరమన్నారు. కేంద్రం ప్రజా వ్యతిరేక పరిపాలన చేస్తుందని ప్రజా వ్యతిరేక పరిపాలనకు వ్యతిరేకంగా మాకు కమ్యూనిస్టులు మాత్రమే పోరాటం కాకుండా కలిసి వచ్చే శక్తులన్నీ కేంద్రంపై పోరాడి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందామని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గద్దె దిగితేనే ఈ దేశానికి రక్షణ ఉంటుందని ఆయన అన్నారు. సిపిఐ మండలంలోని సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించిందని సమస్యల పరిష్కారం కోసం ప్రజలను జాగృతం చేసి పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రవీందర్, శ్యాంసుందర్, కుతుబ్, లక్ష్మీనారాయణ తో పాటు పలువురు సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో నాగర్‌కర్నూల్ జిల్లా పేరు నిలబెట్టాలి

### వెల్టూర్‌లో కబడ్డీ జట్ల ఎంపిక ప్రక్రియ విజయవంతం



వెల్టూర్‌లో కబడ్డీ ఛాంపియన్ ఎంపికలో క్రీడాకారులకు కరచాలనం చేస్తున్న మాజీ సర్పంచ్ లింగమయ్య యాదవ్

**ఉప్పునుంతల, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నాగర్ కర్నూల్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ బాలబాలికల సెలక్షన్ నిర్వహించారు. ఈ సెలక్షన్ కు జిల్లా నుంచి వివిధ పాఠశాలలకు చెందిన బాలుర విభాగం 120 మంది, బాలికల విభాగం 86 మంది క్రీడాకారులు సెలక్షన్‌లో పాల్గొన్నారు. ఈ సెలక్షన్ లో 30 మంది విద్యార్థులు సెలక్షన్ అయ్యారు. వీరికి రేపటి నుంచి 23 వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల పిడి రమేష్ వివరించారు. అదేవిధంగా వెల్టూరు హైస్కూల్‌కు చెందిన నందిని, రాము, అఖిల్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పిడి తెలిపారు. రేపటి నుంచి 23 వరకు సెలక్షన్ అయినా బాలబాలికలకు వెల్టూర్ శిక్షణ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని, నిజామాబాద్ జిల్లా ముష్కల్‌లో జరుగు 35వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఛాంపియన్ పోటీలో ఉంటాయని, జిల్లా స్థాయిలో ఎంపికైన 30 మంది బాల బాలికలు రాష్ట్రస్థాయిలో ఈనెల 25 నుంచి 28 వరకు జరుగు ఛాంపియన్ పోటీలో పాల్గొంటారని ఆయన వివరించారు. జిల్లాస్థాయిలో ఎంపిక ప్రక్రియకు నాగర్కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిక ప్రక్రియలో మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో నాగర్ కర్నూల్ జిల్లా పేరు నిలబెట్టాలని రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు సూచిస్తూ, పలు, సలహా సూచనలు అందించారు. ఈ కార్యక్ర మంలో జిల్లాకబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డితో పాటు ఎస్ ఐ వెంకట్ రెడ్డి, ప్రధానకార్యదర్శి యాదయ్యగౌడ్, కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మనీ, స్వరూప, షంషీర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేష్, మోహన్‌లాల్, సింధు, జ్యోతి, పంచాయతీ కార్యదర్శి ఉమా శంకర్, విశ్రాంత మండల విద్యాధికారి రెడ్డి రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ గున్నమోని లింగమయ్య యాదవ్, బూషి రాజ్ మల్లయ్య, పొన్నగంటి బాల్ రెడ్డి, యువ నాయకులు గుద్దటి బాలరాజు, ఉప్పరి బాలరాజ్, ఎం.డి సమ్మద్, రాము, సయ్యద్, షకీల్, నాగార్జున, జిల్లాలోని వివిధ పాఠశాల లకు చెందిన బాల, బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దేశభక్తి భావాలను విద్యార్థుల్లో తీసుకుపోవడంలో ఏబీవీపీ విజయం

### జాతీయ పునః నిర్మాణంలో విద్యార్థుల,యువత పాత్ర కీలకం : శ్రీశ్రీశ్రీ ఆదిత్య పర శ్రీ స్వామిజీ



మాట్లాడుతున్న శ్రీశ్రీశ్రీ ఆదిత్య పర శ్రీ స్వామిజీ

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పాలమూరు విభాగ్ అభ్యాస వర్గ నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ పాలమూరు విభాగ్ అభ్యాస వర్గకు ముఖ్య అతిథిగా శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరశ్రీ స్వామీజీ, తెలంగాణ ప్రాంత సహ సంఘటన మంత్రి విష్ణు వర్ధన్ జ్యోతి ప్రజ్వలనతో సమావేశాలను ప్రారంభించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరశ్రీ మాట్లాడుతూ జాతీయ పునః నిర్మాణం ధ్యేయంగా పనిచేసే ఏబీవీపీ అనే విద్యార్థి ఈ దేశంలోని ప్రతి విద్యార్థి జాతీయ భావాలను పెంపొందిస్తుంది అన్ని చెప్పుకొచ్చారు. విద్యార్థి పరిషత్ విద్యాలో సంస్కృత సబ్జెక్ట్ ఉండే విధంగా ప్రభుత్వాలను కోరాలని, ప్రతి విద్యార్థి సంస్కృతం పై పట్టు సాధించిన్నప్పుడు ఈ దేశ సంస్కృతి లోతుగా అర్థం చేసుకోకలుగుతాం అన్నారు. విదేశీ దండయాత్ర మన సంస్కృతి ద్వాసం చేయబడిందని విదేశీ బావజ్వాలం కొంత వ్యాప్తి చెందినప్పటికీ విద్యార్థి పరిషత్ జాతీయ భావజ్వాలని విద్యార్థులో నింపే ఏకైక సంస్థగా నిలిచిందన్నారు. ఇంగ్లీష్ భాష మనం ఏర్పాటు చేసుకున్నది కాదు ఇది కంప్యూటర్ భాష, ఖగోళ శాస్త్రంలో ఇంగ్లీష్ భాష యొక్క ప్రాధాన్యత ఏమి ఉండదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏనాటికైనా సంస్కృత భాషా ఈ ప్రపంచాన్ని శాసిస్తూ పూర్వ వైభవాన్ని సాధిస్తుందని పేర్కొన్నారు. ఈ నెల పై పారుతున్న నదులో అద్భుతమైన శక్తి ఉందని ఈ గాలిలో స్వచ్ఛత ఉందని, అపరిమితమైన జ్ఞానానికి ఈ దేశము నిలయం అన్ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. సామల కరుణాకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్ తేజ, విభాగ్ సంఘటన మంత్రి నవేంద్ర, వరంగల్ విభాగ్ సంఘటన మంత్రి పృథ్వీ, నారాయణపేట జిల్లా కన్వీనర్ నరేష్, మహిళా కన్వీనర్ రేణుక, జిల్లా నుండి విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



**ఉప్పునుంతల, సెప్టెంబరు13ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు గ్రామంలో ఉన్న ఊర చెరువు అలుగు ప్రాంతంలో కల్వర్టు (బ్రిడ్జి )నిర్మించాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ను కోరారు. తమ గ్రామంలో ఉన్న ఊర చెరువు వర్షాకాలంలో అలుగు పారుతే వ్యవసాయ పొలాలకు చాలా మంది రైతులు రాకపోకలు చేయడానికి చాలా ఇబ్బంది ఏర్పడుతుందని, వర్షాకాలం వస్తే నరకం అను భవిస్తున్నామని వారు పేర్కొన్నారు. వర్షాకాలంలో దాదాపు నాలుగు నెలల పాటు అలుగు మీదుగా పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందని, ఆ ప్రాంత రైతులు ఆందోళనకు గురై ఎమ్మెల్యే ముందు వాపోయారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణం కోసం అయ్యే ఖర్చు అంచనా వేసి నివేదిక తయారు చేయాలని వారికిహామీ ఇస్తూ భరోసా కల్పించారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన వారిలో కాశిరెడ్డి జంగి రెడ్డి, అర్జునయ్య, శ్రీను, సర్వేశ్వర్, బాల్ లింగం గౌడ్, రాజు, గుద్దటి బాలరాజు, వెంకటేష్, నాని, అనిల్, రమేష్, వేణు కలిశారు.

## సిఎం సోదరుడు తిరుపతిరెడ్డికి ఘన స్వాగతం



సిఎం సోదరుడు తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు13 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ సివిఆర్ భవన్‌కు శనివారం వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణు గోపాల్ ఆధ్వర్యంలో శివన్న సైన్యం సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. వ్యక్తిగత పనిపై కుటుంబ సమేతంగా వారి కూతురు పెళ్లి సందడిలో భాగంగా పట్టు చీరలకు పట్టుకొమ్మయిన నారాయణపేట చీరలకొనుగోలు నిమిత్తం వచ్చారు. తిరుపతిరెడ్డి నేరుగా సివిఆర్‌భవన్‌కు రావడంతో స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన ఉపాధ్యక్షులు కురువ మనోజ్, బండి ఆనంద్, మసి పవన్ గడ్డం వినోద్, జాజాపూర్ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాయిని బాల కిష్టయ్య కుటుంబాన్ని పరామర్శించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

**గండీడ్ సెప్టెంబర్13 ప్రభాతవార్త:** గండీడ్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రాయిని బాల కిష్టయ్య మృతి పార్టీకి తీరనిలోటని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అన్నారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి కొండాపూర్ గ్రామంలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, బాల కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి మాట్లాడుతూ బాల కిష్టయ్య సుమారు 35 సంవత్సరాల నుండి తమ తండ్రి కొప్పుల హరీష్ రెడ్డి గెలుపు కోసం, అనంతరం తమ గెలుపు కోసం ఎంతో కష్టపడి పని చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. బిఆర్ఎస్ పార్టీతో పాటు తానుకూడా బాల కిష్టయ్య కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజి జడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, గండీడ్ మండల పార్టీ అధ్యక్షులు పెంట్యా నాయక్, మాజీ గ్రంథాలయసంస్థచైర్మన్ గోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు వెంకట్రాంరెడ్డి, రామ్‌రెడ్డి, చెన్నారెడ్డి, గోపాల్, ఖాదర్, కృష్ణ, శ్రీనివాస్, సాయి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పీజీలో వనపర్తి విద్యార్థికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్



తల్లిదండ్రులతో రుత్విక్ రెడ్డి

**వనపర్తి రూరల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన స్వప్న, భాస్కర్‌రెడ్డి దంపతుల కుమారుడు డా. రిత్విక్ రెడ్డికి నీట్ పీజీలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. 2019 నీట్‌లో 430 ర్యాంకు సాధించి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ గ్రాడ్యు యేషన్ పూర్తి చేశారు. 2025 నీట్ పరీక్షకు సొంతంగా సన్నద్ధమై జాతీయస్థాయిలో 684 మార్కులు సాధించి 16వ ర్యాంకు తెచ్చుకున్నారు. కాగా నీట్ పీజీలో అర్హత సాధించిన 7179 మందితో కూడిన రాష్ట్ర పీజీ ర్యాంకర్ల జాబితాను కాళోజి యూనివర్సిటీ శుక్రవారం విడుదల చేసింది. ఇందులో భాగంగా సురవరం రిత్విక్ రెడ్డి రాష్ట్రస్థాయిలో ఫస్ట్‌ర్యాంక్ సాధించి వనపర్తి జిల్లాకుపేరు ప్రఖ్యాతులు తెచ్చారు. స్వప్న, భాస్కర్‌రెడ్డి దంపతుల ఏకైక కుమారుడు రిత్విక్ రెడ్డి వైద్య విద్యలో అత్యున్నత స్థానానికి చేరాలన్న తపన రిత్విక్ రెడ్డి తల్లి స్వప్నకు మెండుగా ఉండేది. జాతీయ, రాష్ట్రస్థాయిలో మంచిర్యాంకు సాధించినరిత్విక్‌రెడ్డినిపలువురు అభినందించారు.

## అక్రమంగా తరలిస్తున్న వడ్ల లారీ పట్టివేత



పట్టుకున్న లారీని తనిఖీ చేస్తున్న డిటి పరమేశ్వర్, పెబ్బేర్ సెకండ్ ఎస్సై దివ్యరెడ్డి

**పెబ్బేరు, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం వైశాఖపూర్ గ్రామంలో అద్వైత్ రైస్ మిల్లు నుంచి శుక్రవారం అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న వడ్ల లారీని గ్రామస్తుల సమాచారం మేరకు పెబ్బేర్ ఎస్సై యుగంధర్ రెడ్డి పట్టుకుని పెబ్బేరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గత సంవత్సరంలో ఈ రైస్ మిల్లు సిజ్ చేశారు. అంతకంటే ముందు లావు వడ్లను మాత్రమే మర ఆడించారని దానిలో కూడా 67ఏసీకేలు పెండింగ్ ఉండగా ఇప్పటికీ 30 ఏసికెలు చెల్లించి ఉండగా 37 ఏసీకేలు పెండింగ్లో ఉన్నట్టు సమాచారం. శనివారం మధ్యాహ్నం సివిల్ సప్లై డిఎస్‌ఓ ఆదేశానుసారం సివిల్ సప్లై డిటి పరమేశ్వర్ పెబ్బేర్ పోలీస్ స్టేషన్‌నందు లారీలో ఉన్న సన్న వడ్లను పెబ్బేర్ సెకండ్ ఎస్ఐ దివ్యరెడ్డితో కలిసి పంచనామా చేశారు. డిటి పరమేశ్వర్ మాట్లాడుతూ లారీలో తరలిస్తున్న సన్న వడ్లను శాంపిల్ తీసుకున్నామని వాటిని టెక్నికల్ స్టాఫ్‌కు పంపించి విచారణ చేస్తామని పూర్తిగాఎంక్వయిరీ చేసి వివరాలు వెల్లడిస్తామని తెలియజేశారు.

## బహిరంగ సభకు తరలిన బిఆర్ఎస్ నాయకులు



**అలంపూర్ సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని ఐజ మండల కేంద్రంలోని ఐజ మున్సిపాలిటీ పరిధిలో టీఆర్ఎస్. కార్యకర్తలను పెద్ద ఎత్తునా గద్వాలలోల్ని కేటీఆర్ సభకు ఎమ్ఎల్‌సి, ఎమ్ఎల్‌ఏ ఆదేశాల మేరకు పార్టీ కార్యకర్తలను తరలించారు. మాజీ వైస్ చైర్మన్ మాల నర్సింహులు, చాకలి ఆంజనేయులు ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు మరియు శ్రేణి కార్యకర్తలు ఈ సభకు తరలించారు.

**దేవరకద్ర, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం గద్వాల్ పట్టణంలో జరుగుతున్న బిఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు కౌకుంట్ల మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు. బయలుదేరారు. ఈ సందర్భంగా శనివారం గద్వాల్ గర్జనబహిరంగ సభకు బయలుదేరిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి స్వాగతం పలికిన వారిలో కౌకుంట్ల మండల బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కేటీఆర్ గౌడ్, కురువ రవి, కిష్టన్న, బాలస్వామి, నరేందర్, నవీన్, పుట్టపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభకు బయలుదేరిన బిఆర్ఎస్ నాయకులు

# టికెట్ ఇచ్చేటప్పుడు ఏ లింగము నీకు తెలియదా?!

- పది సంవత్సరాలలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అడ్డగోలుగా కాల రాశారు
- అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్



**అలంపూర్ సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** పదేళ్లలో చేనేత శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ గద్వాల లో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పి చేనేత కార్మికలను మోసం చేశా వని ఆయన పరి మాజీ అలంపూర్ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్య దర్శి సంపత్ కుమార్ అన్నారు. వాటి చుట్టూ శంకుస్థాపన ఫలకం చుట్టు పిచ్చి మొక్కలు మొలిచాయి. కేటీఆర్ వెళ్లి చూడాలి.. అని తెలిపారు. తుమ్మిల ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి సగం,సగం పనులు చేసిపోయారు. సరైన సౌకర్యాలు కల్పించకుండానే వంద పడకల ఆస్పత్రి రిబ్బన్ కట్ చేసి పోయారు అన్నారు. 10 ఏళ్లలో 4 మున్సిపాలిటీ లకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనలలో వంద పడకల ఆస్పత్రిని అన్ని సౌకర్యాలతో ప్రారంభించుకున్నాం. మా ప్రభుత్వ హయాంలో మల్లమ్మ గుంటకు సర్వే పనులు ప్రారంభమయ్యాయి..120 కోట్లతో జూరాల పైన కొత్త బ్రిడ్జిని నిర్మిస్తున్నాం. పదేళ్లలో నడిగడ్డ ప్రజలను మోసం చేశారు. మీరు ఏముఖం పెట్టుకొని గద్వాల సభకు వస్తున్నారని ప్రశ్నిం చారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన స్త్రీ లింగం, పురుష లింగం అంటు కేటీఆర్ విమర్శలు చేస్తు న్నాడు. టికెట్ ఇచ్చేటప్పుడు ఏలింగమో నీకు తెలియదా..10 ఏళ్లలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యా న్ని అడ్డగోలుగా కాలరాశారు. అని మండిపడ్డారు. నేను కాంగ్రెస్ విప్‌గా ఉన్నప్పుడు మా పార్టీ ఎమ్మెల్యేలను ఐదుగురిని, టీడీపీ ఎమ్మెల్యేలను 15 మందిని బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. కేసీఆర్ ఫిరాయింపులపైన నేనే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాను. మీరు చేస్తే సంసారం.. వేరే వాళ్లు చేస్తే వ్యభిచారమా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ రాజకీయాలను వ్యభిచారంగా మార్చారు. నడిగడ్డకు వచ్చే అర్హత కేటీఆర్‌కు లేదు.. ఇక్కడి ప్రజలు తిరగబడతారు జాగ్ర త్తనడిగడ్డకు వచ్చి నువ్వు ఉద్దరించేది ఏమీ లేదు. రేవంత్ రెడ్డి ప్రత్యేక ద్రుష్టి సారించారు గద్వాల జిల్లాలపైన. మీ చెల్లెను చూసుకోలేవు నీవల్లనే బీఆర్ఎస్ మునిగిపోతుందని మీ కార్యకర్తలే అంటున్నారని అన్నారు.

# బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడికి ఘన సన్మానం



బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతి కుమార్‌ను సన్మానిస్తున్న పేట నాయకులు

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతి కుమార్‌ను బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కలిసి నారాయణపేట జిల్లా బిజెపి నాయకులు శనివారం శాలువాలతో ఘనంగా సన్మా నించారు. రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా బండారి శాంతి కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ పేట జిల్లాకు చెందిన రాష్ట్ర బిజెపి సీనియర్ నేత, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రతంగ పాండు రెడ్డి, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివా సులు, జిల్లా అధ్యక్షు డు సత్య యాదవ్, సీనియర్ నాయకుడు రఘువీర్ యాదవ్ ,జిల్లా నాయకులు రఘురామయ్య గౌడ్ మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ బారిన పోగొట్టుకున్న డబ్బులను ఇప్పించిన ఎస్ఐ

**డబ్బులు పోగొట్టుకున్న వారు 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలి : ఎస్ఐ వెంకటస్వామి**



పోగొట్టుకున్న డబ్బులను ఇప్పించిన ఎస్ఐ వెంకటస్వామి

**అలంపూర్ సెప్టెంబర్13, ప్రభాతవార్త :** అలంపూర్ మండల పరిధిలోని గుందిమల్ల గ్రామానికి చెందిన ఆయ్య స్వామి మరియు ఆలంపూర్ టౌన్ కు చెందిన నరేందర్‌రెడ్డి అనే వ్యక్తులు సైబర్ బారినపడి డబ్బులు పోగొట్టుకున్నగా వెంటనే సైబర్ క్రైమ్ పోర్టల్ అయినా 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయగా, స్పందించిన అలంపూర్ ఎస్ఐవెంకటస్వామి, పోలీసు వారు పోగొట్టుకున్న డబ్బులను ఫుట్ ఆన్ హోల్డ్ చేసి వారికి శనివారం రోజు గౌరవ డిఎల్ఎస్ఏ కోర్టు గద్వాల నుండి వారు పోగొట్టుకున్న డబ్బులకు సంబంధించి రిఫండ్ ఆర్డర్స్ ఇప్పించడం జరిగింది. కావున ఎవరైనా సైబర్ బారిన పడితే వెంటనే సైబర్ క్రైమ్ పోర్టల్ కానీ 1930 కానీ, మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో గాని ఫిర్యాదు చేయాలని ఎస్సై వెంకటస్వామి తెలిపారు.

# మాజీ మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం



**ఇటిక్యాల సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బి ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే గర్జన సభకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ హాజరుకానుండగా శనివారం సాయంత్రం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తా లో ఆయనకు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి. అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు. రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్ కుమార్. స్థానిక మండల నాయకులు కార్యకర్తలు కలిసి మాజీ మంత్రి కేటీఆర్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం కారులో బయటకొచ్చి ఎమ్మెల్సీ చల్లా.ఎమ్మెల్యే విజయు డు తో కలిసి కార్యకర్తలకు అభిమానులకు కేటీఆర్ అభివాదం చేశారు. ఈ సందర్భంగా క్రెన్ సహాయంతో పెద్ద గజమాలతో మాజీ మంత్రి కేటీఆర్ కు స్వాగతం పలికారు. మాజీ మంత్రి కేటీఆర్ గద్వాల సభకు రావడంతో ఎర్రవల్లి చౌరస్తాలో కార్యకర్తలు గులాబీ జెండాలతో రెపరెపలాడించారు.

**పెబ్బేరు, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణ హైవే నందు గద్వాల జిల్లాలో నిర్వహిస్తున్న గద్వాల గర్జన భారీ బహిరంగ సభకు వెళుతున్న కేటీఆర్ పెబ్బేరు బైపాస్‌లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నేతృత్వంలో పెబ్బేరు పట్టణ,ఉమ్మడి మండల నాయకులకు, కార్య కర్తలకు టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కరచా లనం చేసి అందరికి మనోధైర్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పెబ్బేరు పట్టణ,ఉమ్మడి మండల పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు,వనపర్తి జిల్లా నాయకులు, మహిళలు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

# చేపల పెంపకానికి శ్రీకారం

**చేప పిల్లలను చెరువులో వదిలిన జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు**



**ధన్వాడ, సెప్టెంబరు 13 ప్రభాతవార్త :** ధన్వాడ మండలం లోని హనుమాన్ పల్లి గ్రామంలో ఆగ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు చేపల పెంప కానికి శ్రీకారం చుట్టారు. శనివారం నాడు కృష్ణాజిల్లా కైకలూరు నుండి తెచ్చిన లక్ష చేపపిల్లలను గ్రామంలోని తిమ్మోని చెరువులో పెంపకానికి వదిలారు. గంగమ్మతల్లి పూజ నిర్వహించి చెరువులు చేపలు వదిలారు. వదిలిన చేపలలో బొచ్చ రోహు బంగారు తీగగడ్డి చేపరకం ఉన్నాయి. కార్య క్రమంలో ఎఫ్‌సిఎస్ హనుమాన్ పల్లి సంఘం అధ్యక్షులు మోహన్,ఉపాధ్యక్షులు నారాయణ, కార్యదర్శి శ్రీనివాసులు, మత్య సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నీరటి నరసింహనాయుడు, వెంకటయ్య, సురేష్, వెంకట రాములు తదితరులు పాల్గొన్నారు.

# అపరచిత వ్యక్తులను నమ్మకూడదు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**వెల్దండ, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తుల మాయ మాటలను ఎట్టి పరిస్థితులలోనమ్మకూడదని పోలీస్ సిబ్బంది రైతులకు, ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద శనివారం సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పిం చారు. పోలీస్‌సిబ్బంది మాట్లాడుతూ సెల్ ఫోనుల ద్వారా వచ్చే మెసేజ్ లకు స్పందించవద్దని, బ్యాంకు ఖాతా నెంబరు ఓటిపి ఎట్టి పరిస్థితు ల్లో తెలపకూడదని, డబ్బులు పెట్టుబడి పెడితే పెద్ద మొత్తంలో డబ్బు వస్తుందని ఆశ చూపే వాటిలో పెట్టిమోసపో కూడదన్నారు. పోలీసు సిబ్బంది నవీన్, కృష్ణ, రైతులు ఉన్నారు.

# జర్నలిస్టుల ఆరోగ్యం సమాజానికి అవసరం

**-టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



జర్నలిస్టులతో టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**కల్వకుర్తి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** సమాజానికి సేవ చేసే జర్నలిస్టులకు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ప్రజలకు సమాచారం అందించడంలో ముందువరుసలో ఉంటారు కానీ వారి వృత్తి కారణంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. శనివారం కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్ మండల కేంద్రంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఆమన గల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల జర్నలిస్టులు మరియు వారి కుటుంబాల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఉచిత మొబైల్ హెల్త్ క్యాంప్‌ను టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్



పరీక్షలు నిర్వహించుకుంటున్న జర్నలిస్టులు

రెడ్డి ప్రారంభించారు. హెల్త్ క్యాంప్‌లో 110 మంది జర్నలిస్టు సోదరులు వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించు కున్నారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడు తూ భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాంమని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు.. ఆదివారం కల్వకుర్తిలో కూడా జర్నలిస్టుల కోసం హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం పలు మండలాల పాత్రికేయులు మాట్లాడుతూ మా వృత్తి కారణంగా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం కుదరదు. కానీ మా కోసం, మా కుటుంబాల కోసం ఇలాంటి అవకాశాన్ని కల్పించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ ఉచిత ఆరోగ్య శిబిరం మాకు నిజంగా ఎంతో ఉపయోగకరం అని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు జైపాల్ రెడ్డి, రచ్చ శ్రీరాములు, నరేందర్ గౌడ్, మల్లేష్ నాయక్, గణేష్, కొండల్ యాదవ్, రమేష్ నాయక్, యాదయ్య, శ్రీపతి, శేఖర్, శ్రీను, మహేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను వక్రీకరించే ప్రయత్నం

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్**



సమావేశంలో మాట్లాడుతున్న ఫయాజ్

**బిజినేపల్లి, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** ప్రపంచ పోరాట చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడ్డ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట త్యాగాలను వీర చరిత్రను బిజెపి వక్రీకరించే ప్రయత్నం మానుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం తెలంగాణ సాయుధ పోరాటవారోత్సవాల్లో పోరాట వీరులు రావి నారాయణరెడ్డి మగ్గం మోయుద్దిన్ బద్దంఎల్లారెడ్డిలకు నివాళులర్పించారు. ఫయాజ్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం ఆనాడు సాయుధ పోరాటం జరిగిందని అన్నారు. ఈ పోరాటంలో ఎంతో మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని గుర్తు చేశారు. పోరాట క్రమంలో దొడ్డి కొమరయ్య నుండి మొదలుకొని నాలుగు వేల ఐదువందల మంది కమ్యూనిస్టు యోధులు తమ ప్రాణాలను బలిచ్చి మరి తెలంగాణ ఉద్యమాన్ని నిర్మించారని వారు గుర్తు చేశారు. చాకలి ఐలమ్మ ఆరుట్ల కమలాదేవి ఆరుట్ల రామచంద్రారెడ్డి నల్లమల్ల గిరి ప్రసాద్ ధర్మ బిక్షం సురవరం వెంకట్రాంరెడ్డి లక్ష్మణాచారి కటికనేని గోపా లరావు సిఆర్ శర్మ ఇలా అనేకమంది ఈ ప్రాంతానికి చెందిన రాష్ట్రానికి చెందిన వీరులు తమ విలువైన జీవితాన్ని చెరసాలలో గడపడం ప్రాణాలను ప్రజల కోసం అర్పించడం జరిగిందన్నారు. బిజెపి దాని అనుబంధ సంఘాలు కమ్యూనిస్టులు చేసిన త్యాగాల ను దొంగలించి ఈ వీర యోధుల త్యాగాలను హైజాక్ చేసే కుట్రలకు పాల్పడుతుందని ఆయన దుయ్యబట్టారు. ఏ చరిత్ర లేని బిజెపి ఇతరుల చరిత్రను దొంగలించడం పనిగా పెట్టుకుందని ఆయన విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాటానికి అసలు సిసలు వారసులం కమ్యూనిస్టులే ఎర్రజెండా బిడ్డలేనని సిపిఐ తెలంగాణ ప్రజలను భారతీయులుగా తీర్చిదిద్దిన మహోద్యమం నిర్మించిన గొప్ప చరిత్ర కలిగిన రాజకీయ పార్టీ అని ఫయాజ్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, మండల సహాయ కార్యదర్శి ఈర్ల భూపేష్, పి.కృష్ణ,జి.జక్కలయ్య, మంగంపేట శ్రీనివాస్, టి.కిరణ్ కుమార్, చందు, మధు, కృష్ణ, రవి, నారాయణ, సాయిలు, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం పీఏసీఎస్‌ను ముట్టడించిన రైతులు



రైతులకు నచ్చజెబుతున్న పోలీసులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** పంటలకు యూరియా కొరత ఏర్పడటంతో చేతికొచ్చే పంటలు పూర్తిగా నాశనమై రైతులు అప్పుల పాలయ్యే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్ సెంటర్‌ను రైతులు ముట్టడించి ప్రభుత్వానికి విరుద్ధంగా నినాదాలు చేస్తూ యూరియా కావాలి అంటూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏనాడు ఈ విధంగా యూరియా కొరత లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే యూరియా కొరత ఏర్పడిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి విరుద్ధంగా ఎమ్మెల్యే రావాలంటూ రైతులు నినాదాలు చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రైతులకు నచ్చజెప్పి నిరసన కార్యక్రమాన్ని విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



వైశాఖపూర్ రైతువేదికలో యూరియా పంపిణీ చేస్తున్న సింగిల్ విండో చైర్మన్

# ఎమ్మెల్యే ఆదేశాలతో యూరియా పంపిణీ

**పెబ్బేరు, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం పై శాఖపూర్ గ్రామంలో క్లస్టర్ రైతు వేదికలో శనివారం రోజు వనపర్తి శాసనసభ్యులు తుడి మెగారెడ్డి ఆదేశానుసారం సింగల్ విండో చైర్మన్ కోదండరామిరెడ్డి యూరియా పంపిణీ చేశారు. శాఖాపూర్ క్లస్టర్ గ్రామ రైతులకు యూరియా సాటేజ్ ఉన్న విషయం గ్రామ కాంగ్రెస్ నాయకులు తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి శనివారం రోజు రైతు వేదికలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ షేక్ మున్నా, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్,పురు రమణ, తిరుపతయ్య, సందీప్ కుమార్ రెడ్డి, శ్రావణ్ కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

**బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ**

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదని బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ అన్నారు. శని వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిరక్ష ్యంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించని కారణంగా 15వ ఆర్థిక సంఘం నిధులు రాకుండా వృధా అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయితీ ఎన్నికలు నిర్వహిస్తే ఓడిపో తామన్న భయంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాయిదా వేస్తువస్తున్నారని అన్నారు. పంచాయితీ పాలక వర్గం పాలన ముగిసి రెండేళ్ల కాలం గడిచినా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ ఎన్నికలు నిర్వహిం చడం లేదన్నారు. పంచాయితీ ఎన్నికలు నిర్వహించని కారణంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 వందల కోట్ల నిధులు గండి పడిందని మర్శించారు. దాంతో గ్రామాల్లో పంచాయితీలు దుర్భర పరిస్థితుల ను ఎదుర్కొంటున్నాయని అన్నారు. సమస్యలు తీరక ప్రజలు సతమతం అవుతు న్నారనీ అన్నారు. కానీ కాంగ్రెస్ అధికార దాహంతోఎన్నికలు నిర్వహించకుండా ప్రజలను ఇబ్బం దులకు గురి చేస్తున్నదన్నారు. ఇలాంటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికలు ఏప్పుడు నిర్వహించిన తగిన బుద్ది చెప్పాలని ప్రజలను కోరారు.

# మహిళా డిగ్రీ కళాశాలలో దోస్త్ స్పాట్ అడ్మిషన్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో, 13 సెప్టెంబరు ప్రభాతవార్త:** ఎన్.టి. ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మహబూబ్‌నగర్‌లో, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కమిషనర్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారి ఆదేశానుసారం డిగ్రీ కోర్సులలో మిగిలిపోయి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ల కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ ప్రక్రియ రెండు విడతలలో నిర్వహించబడును. మొదటి విడత కేవలం లోకల్ విద్యార్థులకు మాత్రమే స్పాట్ అడ్మిషన్లు ఇవ్వబడును. అడ్మిషన్ పొందగోరు విద్యార్థులు ఇదివరకే దోస్త్ లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఎక్కడ కూడా సీటు పొందని వారు తమ ధృవీకరణ పత్రాలైన ఎస్ఎస్‌సి మెమో, ఇంటర్మీడియట్ టిసి, మెమో, కుల ధృవీకరణ పత్రం, బోనఫైడ్, ఆధార్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో,(రిజిస్ట్రేషన్ చేసుకున్న అప్లికేషన్ ప్రింట్ తీసుకొని) ఒక ఫోటో జత చేసి తేదీ 15. 9. 2025 నుండి 16.9.2025 వరకు అప్లికేషన్స్ సమర్పించాలి. అదే విధంగా ఇంతవరకు దోస్త్ లో రిజిస్ట్రేషన్ చేసుకోని వారు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకొని అప్లికేషన్ తో పాటు పైన చెప్పిన సర్టిఫికెట్లతో15.09.2025,16.09.2025 తేదీలలో కళాశాలలో దరఖాస్తులు సమర్పించవలెను. అర్హులైన వారికి 17.9.2025న కళాశాలలోని సిసి ఓటీపీ ద్వారా కళాశాల సీట్లు ఇవ్వబడును. మొదటి విడతలో మిగిలిన సీట్లకు రెండవ విడత లో తేదీ 18. 9. 2025 నుండి 19.9. 2025 వరకు లోకల్ నాన్ లోకల్ విద్యార్థుల నుండి అప్లికేషన్లు స్వీకరించి 20.9.2025 నాడు అర్హత గల విద్యార్థులకు సిసి ఓటీపీ ద్వారా సీటు ఇవ్వబడును అని తెలియజేశారు. ఈ ప్రక్రియ మొత్తం ప్రభుత్వ రిజర్వేషన్ నియమాలకు అనుగుణంగా నిర్వహించబడును. అడ్మిషన్ పొందగోరువిద్యార్థులు తప్పనిసరిగా కళాశాలలోనే సంప్రదించా లని కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు. ఇతర వివరాల కొరకు కళాశాల దోస్త్ కన్వీనర్ యం. మధుసూదన్ శర్మని 944084 2201 సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు.

# ఆంజనేయస్వామిని దర్శించుకున్న కల్వకుర్తి జడ్జి

**ఊర్కొండ, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** ఊర్కొండ మండల పరిధిలోని ఊర్కొండపేటలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామిని శనివారం కల్వకుర్తి జడ్జి శ్రీదేవి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జడ్జి శ్రీదేవి పేరిట ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ నారెడ్డి సత్యనారాయణరెడ్డి, పాలకమండలి సభ్యులు ఆంజనేయులు, దారాబంగారయ్య, మల్లేష్, రమేష్, ఎక్స్ అఫీషియో మెంబర్ మహేష్ శర్మ, అర్చకులు శ్రీనివాస శర్మ, ఎస్సై కృష్ణదేవ, పోలీస్ సిబ్బంది, హర్ష, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# బాల్య వివాహాలపై అవగాహన

**నారాయణపేట, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** బాల్య వివాహాల నిర్మూలనలో భాగంగా విజన్ సేవా సంస్థ జిల్లా సమన్వయకర్త రవికుమార్ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయంలో బాల్య వివా హాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు రఘు, ప్రేమ్, జోషి మాట్లాడుతూ మా ఆలయంలో 18 సంవత్సరాలు నిండని అమ్మా యిలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాహాలు జరపమన్నారు. అలాగే ఎవరైనా బాల్య వివాహాలు చేయాలని ఆలయానికి వస్తే, తక్షణమే విజన్ సేవా సంస్థ సభ్యులకు లేదా బాలల సహాయ ఫోన్ 1098 కు సమాచారం అందిస్తామని తెలిపారు. అలాగే బాల్య వివాహాలు నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తూ బాల్య వివాహాలు లేని నారాయణపేట లక్ష్య సాధనలో ముందుండి సహకరిస్తామని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు, విజన్ సేవా సంస్థ సభ్యులు, మండల వనరుల ఉపాధ్యాయులు అశోక్, రమేష్, శైలజ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# ఖాతాదారులు కేవైసీ చేయించుకోవాలి

**బిజినేపల్లి, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** బ్యాంకు ఖాతాదారులు కేవైసీ తప్పకుండా చేయించుకోవాలని బ్రాంచ్ మేనేజర్ నవీన్ కుమార్ సూచించారు. లట్టుపల్లి గ్రామంలోఎస్‌బిఐ బ్రాంచ్ ఆధ్వ ర్యంలో ఫైనాన్సియల్ ఇన్క్లూషన్ సాచురేషన్ క్యాంప్ శనివారం నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకున్నట్లు అయితే ప్రభుత్వం తరుపున మూడు శాతం సబ్వెనుషన్ వస్తుంది అన్నారు. మహిళా సంఘాల గ్రూప్ లోన్స్ సభ్యురాళ్లతో మాట్లాడి పొందిన రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలను పొందాలని సూచించారు. రైతులు మహిళా సంఘాల సభ్యుల అభివృద్ధి కోసం కృషి చేయను న్నట్లు తెలిపారు. అకౌంటు ఓపెనింగ్స్, ఆన్లైన్ బ్యాంకింగ్ వంటి అంశాలపై, ప్రజలకు వివరించారు. అలాగే పర్సనల్ ఆక్సిడెంట్ ఇన్సూరెన్సు, హెల్త్ ఇన్సూరెన్సు, లైఫ్ ఇన్సూరెన్సు వివిధ రకాల గవర్నమెంట్ స్కీమ్‌లపై వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఫరూక్ భాషా, ఇన్సూరెన్సు మేనేజర్ సతీష్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్లు, రవి కుమార్, రాజా సులేమాన్, మినీ బ్యాంక్ సిబ్బంది సుబాష్ ,విష్ణువర్ధన్, ఆంజనేయులు, రాము, ప్రసాద్, జమీల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట చరిత్రను చేరపలేరు

**బిజినేపల్లి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తున్నదని చెరిపేస్తే చరిత్ర చెరిగి పోదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ అన్నారు. శనివారం సిపిఎం రాష్ట్ర కమిటీ ముద్రించిన బుక్లెట్స్ ను మండల కేంద్రంలో విడుదల చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరా టాన్ని హిందూ ముస్లింల గొడవగా చిత్రీకరించే ప్రయత్నం బిజెపి చేస్తున్నదని అన్నారు. విమోచన దినం అంటూ సభలు పెట్టుకొని ఆనందంపొందడం తెలంగాణ ప్రజలను కుల మతాలకు అతీతంగా జరిగిన ఈ పోరాటాన్ని వక్రీకరించడం దుర్మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు చంద్రశేఖర్, మల్లేష్, సంతోష్, మల్లేష్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

# ఊట్కూర్‌లో తాగునీటి ఎద్దడి

**ఊట్కూర్, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల కేంద్రంలోని, దేవి నగర్, శివాజీ నగర్, మెయిన్ బజార్, సర్దార్ నగర్, శ్రీకృష్ణ నగర్ తదితర కాలనీలలో గత మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్ద చెరువు వద్ద ఉన్న నీటి ట్యాంక్ కు ప్రధానంగా బోర్లు ద్వారా నీటి సరఫరా జరుగుతుంటుంది. అయితే పెద్ద చెరువు నీట మునిగిపోవడంతో బోర్లు పని చేయకపోవటంతో సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా ట్యాంక్‌కు నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. ప్రస్తుతం రోషనాలి దర్గా వద్ద ఉన్న బోరు ద్వారా మాత్రమే నీటిని పంపిస్తున్నారు. అయితే అక్కడి బోరు నుంచి నీరు తక్కువగా రావడం వల్ల ఒకసారి ట్యాంకు నిండేందుకు దాదాపు 10 గంటల సమయం పడుతోందని గ్రామపంచాయతీ సిబ్బంది తెలిపారు. రోజుకు ఒక్కసారే సరఫరా జరుగుతున్నా, వచ్చే నీరు కాలనీల్లోని అన్ని ఇళ్లకు సరిపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. తాగునీటి కోసం గంటల తరబడి మహిళలు, పిల్లలు బిందెలతో క్యూల్లో నిలబడాల్సి వస్తోంది. కొంతమంది ప్రైవేట్ ట్రాక్టర్లు, ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసే పరిస్థితి తలెత్తింది. ఆర్థికంగా బలహీన వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోతు న్నారు. ఈ సమస్యపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే తాత్కాలికంగా అదనపు బోర్లు, ట్యాంకర్లు ఏర్పాటు చేసి సరఫరా చేయాలని కోరు తున్నారు. అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# టెట్ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలి

**పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్**

**జడ్చర్ల, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** 2011 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్ డిమాండ్ చేశారు. టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) తీర్పునకు సంబందించి ఉపాధ్యాయ నాణ్యతను నిరంతరం మెరుగు పరచాలనే సూత్రాన్ని ప్రభుత్వం సమర్థిస్తుందని, భవిష్యత్ నియా మకాలకు టెట్ తప్పనిసరి అవసరంగా ఉండాలని, ఇప్పటికే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఈ అవసరాన్ని పునరాలోచనలో వర్తింపజేయడం తీవ్ర ఆందోళనను సృష్టించిందన్నారు. 2011కి ముందు నియమించబడిన 70వేల మందికి పైగా ఉపాధ్యాయుల పై ఈ తీర్పు ప్రభావం చూపిందని, ఈ తీర్పు పై ప్రభుత్వం చర్య తీసుకోవాలని, 2011 కంటే ముందు నియామకమైన ఉపాధ్యా యులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కొత్త నియామకాలకు మాత్రమే కనీస అర్హతలను నియంత్రించే సెక్షన్ 23 కింద, తప్పనిసరి విద్యకు పిల్లల హక్కు చట్టం, 2009 ఆధారంగా సమీక్ష పిటిషన్ దాఖలు చేయబడుతుంది. ఇది ఇప్పటికే సేవలో ఉన్న ఉపాధ్యాయుల తప్పనిసరి పదవీ విరమణకు కారణం కాదు. టెట్‌ని ప్రవేశపెట్టిన ఆగస్టు 23, 2010న ఎన్‌సిటిఇ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఆ తేదీకి ముందు నియమించబడిన ఉపాధ్యాయులకు దానినిబంధనలు వర్తించవు. టెట్ యొక్క మునుపు అమలు చట్టబద్ధంగా నియమించబడిన ఉపాధ్యాయుల యొక్క సంక్రమిత హక్కులను దెబ్బతీస్తుంది అని అన్నారు.

# జర్నలిజం పవిత్రమైన వృత్తి : సీఐ కమలాకర్

**జడ్చర్ల, సెప్టెంబర్13 ప్రభాతవార్త:** జర్నలిస్టులు సమాజ సమస్యలను వెలుగులోకి తెచ్చే వారని, జర్నలిజం వృత్తి ఎంతో పవిత్రమైనదని జడ్చర్ల సిఐ కమలాకర్ పేర్కొన్నారు. జడ్చర్లలో కొత్త ప్రెస్ క్లబ్ ఏర్పాటు శుభ పరిణామం జడ్చర్ల పట్టణంలో నూతనంగా ప్రెస్ క్లబ్ కమిటీ ఏర్పాటు కావడాన్ని జడ్చర్ల పట్టణ సీఐ కమలాకర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ నిస్వార్థంగా పనిచేసే పాత్రికేయులు సమాజానికి మార్గదర్శకులవుతారని ఆయన అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులు కలిసికట్టుగా ఉండి ప్రెస్ క్లబ్ ద్వారా మరింత సమన్వయంతో ప్రజలకుసేవలు అందించాలని ఆకాంక్షించారు. నిజాయితీ, నిబద్ధతతో వ్రాసే వార్తలు మాత్రమే ప్రజల్లో విశ్వాసం నింపగలవని సూచించారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు శేఖర్ తెలుగు, ప్రధాన కార్యదర్శి సుల్తాన్, సంయుక్త కార్యదర్శి మల్లేష్,కోశాధికారి ప్రభాకర్, ఈసీ మెంబర్లు తాంబూలం శ్రీనివాస్, కిరణ్మయిలను శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు జయప్రకాష్, మల్లేష్, ఖాదర్, హెడ్ కానిస్టేబుల్ రమేష్, విష్ణు, చంద్రశేఖర్, కర్ణాకర్, చిట్టెమ్మ పాల్గొన్నారు.

## మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు బంద్



మంచినీటి ట్యాంక్ వద్ద మంచినీళ్లను పట్టుకుంటున్న గ్రామస్థులు

**వెల్దుర్తి, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
గత మూడురోజుల నుండి మిషన్‌భగీరథ నీరు బంద్‌కావడంతో మండలంలోని కుకునూరు గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడింది. గ్రామానికి మిషన్ భగీరథద్వారా వస్తున్న తాగునీరు మూడురోజుల నుండి బంద్‌కావడంతో తీవ్రమంచినీటి ఎద్దడి నెలకొందని గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామంలో ట్యాంకర్‌ద్వారా నీరు త్రాగునీటికి తీసుకోవాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలో పంచాయతీ బోరుబావులు ఉన్నప్పటికీ మోటర్లు కాలిపోవడంతో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడిందని అన్నారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నప్పటికీ గ్రామం పెద్దదికావడంతో నీరు సరిపోవడంలేదని, అధికారులు స్పందించి నీటి ఎద్దడి తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఆకతాయిలకు ప్రభుత్వ పాఠశాలలు అడ్డా...



పాఠశాల వద్ద ఆకతాయిలు తాగిపడేసిన కల్లు సీసాలు దర్శనం

**వెల్దుర్తి, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
మండలంలోని ఎలుకపల్లి గ్రామంలో ప్రభుత్వపాఠశాల వద్ద కల్లు సీసాలు దర్శనం ఇస్తున్నాయి. ప్రభుత్వపాఠశాలవద్ద కొందరువ్యక్తులు కల్లుతాగుతూ అక్కడే సీసాలను వదిలేసి అపరిశుభ్రంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పాఠశాలలు మద్యం అడ్డాలుగా మారుతున్నాయని, కొందరు రాత్రివేళలో మద్యం సేవిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఇలాంటిఘటనలు జరగకుండా చూడాలని, గ్రామంలో ఎవరు ఇలాంటి అగత్యానికి పాల్పడవద్దని గ్రామస్థులు తెలిపారు. ఎవరు ఇలాంటి పనులు చేస్తున్నారని తెలిస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ఈనెల 17న జిల్లా కబడ్డి సబ్‌జూనియర్ జట్ల ఎంపిక

**పాపన్నపేట, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన పాపన్నపేటలో ఈనెల 17న జిల్లా కబడ్డి అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్ జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లా సెక్రటరీ రమేష్ తెలిపారు. ఈనెల 17న పాపన్నపేట ఉన్నతపాఠశాల గ్రౌండ్లో ఉదయం 10గంటలకు ఎంపికలుంటాయని, ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లాలో జరుగబోయే రాష్ట్ర స్థాయి అంతర్‌జిల్లాల కబడ్డి చాపియన్‌షిప్‌లో జిల్లా తరపున పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 16సం.లోపు ఉండాలని, బరువు 55కిలోలకు మించి ఉండకూడదని వెల్లడించారు. మిగతా వివరాలకు 9010735121 నెంబర్లో సంప్రతించాల్సిందిగా సూచించారు.

## ఆలయ పరిసరాలల్లో బిజెపి స్వచ్ఛ భారత్



ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న బిజెపి నాయకులు

**సిర్గాపూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
బిజెపి పిలుపుమేరకు శనివారం బిజెపి మండలాధ్యక్షులు బిరాదర్ శంకర్ పాటిల్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలోభాగంగా ఆలయపరిసరాలను పరిశుభ్రంచేశారు. ప్రతి ఒక్కరు తమ ఇంటిపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం తమ అదుపులో ఉంటుందని బిరాదర్ శంకర్‌పాటిల్ మండల ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో బిజెపి మండల మాజీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, పార్టీ ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌పాటిల్, బలరామ్, ఎస్సీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియా కొరత లేదు

**-నానోయూరియాపై రైతులు దృష్టిసారించాలి**
**జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్..**

**నర్సాపూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
రైతులు యూరియాకోసం ఆందోళనచెందవద్దని జిల్లాలో రైతులకు సరఫరాకోసం యూరియా ఉందని, యూరియా కొరతలేదని జిల్లావ్యవసాయ అధికారి దేవకుమార్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ గ్రామంలోని రైతువేదికలో రైతులకు యూరియాపంపిణీని ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో నానోయూరియా వినియోగంపై క్షేత్ర సందర్శనలో భాగంగా రైతులకు ఆయన అవగాహనకల్పించారు. ఈ సందర్భంగా ఆవంచ గ్రామంలోని భాస్కర్‌రెడ్డి అనే రైతు తన 13ఎకరాల వరిపొలంలో నానోయూరియా డ్రోన్‌ద్వారా పిచికారిచేయించగా పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్‌తోపాటు ఏఆర్‌ఎస్ నత్నాయపల్లి శాస్త్రవేత్త లక్ష్మణ్, ఏడిఏ సంధ్యారాణి, మండల వ్యవసాయ అధికారిణి దీపిక, ఏఈఓ రుతు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**-బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న పాపగారి రమేష్‌గౌడ్, తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
కేంద్రంలో బిజెపిపార్టీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమపథకాలను ప్రజల్లోకితీసుకెళ్లాలని బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్ అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలో బిజెపి పట్టణ అధ్యక్షులు నీరుడు చంద్రయ్య, కార్యదర్శి సంఘసాని రాజుల ఆధ్వర్యంలో సేవాపక్షం పట్టణస్థాయి కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పెద్ద రమేష్‌గౌడ్, జిల్లాకార్యదర్శి బాదే బాలరాజ్, పట్టణ కన్వీనర్ గుండం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్ళీ దుర్గమ్మ దర్శనం బంద్...

**-సింగూరు నుండి 9675 క్యూసెక్కుల వరద**
**-పరిస్థితి సమీక్షించిన అదనపు కలెక్టర్, అడిషనల్ ఎస్పీ**

**పాపన్నపేట, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయాన్ని శనివారం మళ్ళీ మూసివేశారు. సింగూరు నుండి 9675 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో, ఘనపురం ఆనకట్ట మళ్ళీ పొంగి పొర్లుతుంది. ఆలయం ముందు నుండి వరద వెళ్తుండటంతో, ఇరిగేషన్ అధికారుల సూచన మేరకు ఆలయాన్ని మూసివేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు చేస్తున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్ వేరు వేరుగా ఏడుపాయలకు వచ్చి, అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయం ముందు నుంచి వెళ్తున్న మంజీరా వరదలు పరిశీలించారు. అటువైపు భక్తులెవరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టాపర్లు ఏర్పాటు చేయాలని, ఘనపురం ఆనకట్ట వైపు ఎవరు వెళ్ళొద్దని, మత్స్యకారులు, పశువుల కాపర్లు నది వైపు వెళ్ళకుండా చూడాలని సూచించారు.



వరద ఉధృతిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఎం.నగేష్

## నర్సింగ్ వృత్తివిద్యలో విద్యార్థినులు రాణించాలి

**-ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి**



కార్యక్రమంలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థినులు

**గజ్వేల్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో శనివారం ఎంపిహెచ్‌డబ్ల్యూ మొదటి సంవత్సరం విద్యార్థులకు క్యాపింగ్ సెరిమనీ కార్యక్రమాన్ని స్థానిక కోల అభిరామ్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నర్సింగ్ వృత్తివిద్యా కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థినులను అభినందించారు. విద్యార్థులు ఎంచుకున్న నర్సింగ్ వృత్తి చాలా పవిత్రమైనదని, బాధ్యతతో కూడుకున్నదన్నారు. భవిష్యత్తులో ఈ వృత్తిలో బాగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ వరలక్ష్మి, భాస్కర్‌రెడ్డి, బిక్షపతి, అనిల్, కృష్ణ, సాయినాథ్, కనకరాజు, భానుచందర్, సంతోషికుమారి, అస్మాఖానమ్, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో సెంట్రల్ లైటింగ్

**-ఎమ్మెల్యే రోహిత్‌రావు సహకారంతో అభివృద్ధి దిశగా ముందడుగు**
**-టిపిసిసి కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు**



క్రేన్ సహాయంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు వేగం పుంజుకుంటున్నాయి. శనివారం స్థానిక ఎస్సీకాలనీ నుంచి మెదక్ రోడ్డు బ్రిడ్జి వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు టిపిసిసి సభ్యుడు చౌదరి సుప్రభాత్‌రావు ప్రారంభం చేశారు. సుమారు రూ.కోటికి పైగా వ్యయంతో చేపడుతున్న ఈప్రాజెక్టులో భాగంగా 200 బటర్‌ఫ్లై లైట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈసందర్భంగా చౌదరి సుప్రభాత్‌రావు మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధిలో స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు చూపుతున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, సరాఫ్ యాదగిరి, మర్కు గంగారం, చింతల స్వామి, పిట్ల ప్రకాష్, పోచమ్మల అశ్విని శ్రీనివాస్, ఎనిశెట్టి అశోక్, బీర రామచంద్రం, దారం సంతోష్‌కుమార్, బొట్ల బాబు, విప్లవ్, గొల్పర్తి రాము, ఎర్రగొల్ల రమేష్, ఎర్రం యాదగిరి, చిలుక విరాట్, చింతల నరేష్‌తోపాటు స్థానికప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## 17న ప్రతి గ్రామంలో జాతీయ జెండాను ఆవిష్కరించాలి

**చిన్నకోడూరు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఈనెల 17న ప్రతి గ్రామంలో జాతీయజెండాను ఆవిష్కరించాలని బిజెపి మండలపార్టీ అధ్యక్షులు సూరగోని శేఖర్‌గౌడ్ అన్నారు. చిన్నకోడూరు మండలకేంద్రంలో శనివారం సేవాపక్షంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయనపాల్గొని మాట్లాడారు. 17న ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా స్వచ్ఛభారత్‌లో భాగంగా పరిసరాలను పరిశుభ్రంచేయాలని, ప్రతిగ్రామంలో దివ్యాంగులకు సన్మానకార్యక్రమం, రక్తదానశిబిరాలు నిర్వహిద్దామన్నారు. అమ్మపేరుతో మొక్కను నాటాలని పార్టీశ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో పిట్ల పరశురాములు, వనజ, బస్వరాజ్, మహేష్, అక్కి సంతోష్‌కుమార్, బాపయ్య, నరేందర్, రాజేష్, స్వామి, కిషన్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్సీ హౌజ్ అరెస్టు



బిజెపి ఎమ్మెల్సీ, బిజెపి జిల్లా అధ్యక్షులను హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు

**రామచంద్రాపురం, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు భారతీయ జనతా పార్టీ మద్దతు ప్రకటించినందున రామచంద్రాపురం పట్టణంలోని బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డిలు ధర్నాకు వెళ్లకుండా పోలీసులు శనివారం హౌజ్ అరెస్టుచేశారు. ఈసందర్భంగా చిన్నమైల్ గోదావరి, అంజిరెడ్డిలు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అనాలోచిత వైఖరిమూలంగా తెలంగాణ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్, చిన్నస్థాయి కేబుల్ ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నారన్నారు. అక్రమ అరెస్టులు తగవని వారు హెచ్చరించారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన బిఆర్‌ఎస్ లాగే కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు.

## మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు పెంచాలి

**-ఏఐటియుసి జిల్లా ఉపప్రధాన కార్యదర్శి చిరంజీవి**

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు పెంచాలని ఏఐటియుసి జిల్లా ఉపప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్‌చేశారు. శనివారం చిరంజీవి విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల వేతనాలు పెంచాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. కార్మికులకు 26వేల రూపాయలకు వేతనాలుపెంచి, ఉద్యోగభద్రత కల్పించాలని, ఈఎస్, పిఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. అధికారులు స్పందించి వేతనాలు పెంచకపోతే రానున్న రోజుల్లో సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు అశోక్, మిషన్ భగీరథ కార్మికులు నగేష్, శివరాజ్, అశోక్, కాశీనాథ్, శంకరప్ప, మల్లికార్జున్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## తపస్ మండల నూతన కమిటీ ఏకగ్రీవం

**నర్సాపూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలో శనివారం మండల తపస్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు తపస్ నర్సాపూర్ మండల అధ్యక్షులుగా సిపి.శివకుమార్ (ఎస్‌జిటి, ఎంపియుపిఎస్ తుజాల్‌పూర్), ప్రధాన కార్యదర్శిగా కె.రవికుమార్ (ఎస్‌జిటి ఎంపిపి ఎస్.నారాయణపూర్), కోశాధికారిగా సిహెచ్.కృష్ణ (జెడ్పిహెచ్‌ఎస్ రుస్తుంపేట) ఉపాధ్యక్షులుగా బి.ప్రవీణ్‌కుమార్ (జడ్‌పిహెచ్‌ఎస్ రుస్తుంపేట), పి.శ్రీనివాస్ (ఎంపిపిఎస్ రుస్తుంపేట,), హర్షవర్ధన్‌రెడ్డి (ఎంపియుపిఎస్ అహ్మద్‌నగర్), కార్యదర్శులుగా చెన్నారెడ్డి (ఎస్జీటి ఎంపిపిఎస్ కాకజ్‌మజ్దూర్), టీ.కిష్టయ్య (ఎస్జీటి ఎంపిపిఎస్ మంతూర్), జి.రాజు (ఎస్జిటి ఎంపిపి ఎస్.తిరుమలాపూర్) ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తపస్ డివిజన్ ఇన్చార్జి నాయిని నరేందర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రాంచందర్‌నాయక్, కొండల్ తెలిపారు.

## నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**నర్సాపూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
నర్సాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో డిగ్రీ మొదటిసంవత్సరం అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.హుస్సేన్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ మొదటిసంవత్సరం అడ్మిషన్లు సెప్టెంబర్ 15, నుంచి 16, 2025 వరకు రెండురోజుల పాటు జరగనున్నాయని తెలిపారు. ఉదయం 10:00గంటల నుంచి సాయంత్రం 5:00గంటల వరకు విద్యార్థులు సిద్ధమవ్వాలని ప్రిన్సిపల్ కె.హుస్సేన్ సూచించారు. కళాశాలలో బిఎ(ఇంగ్లీష్‌మీడియం, తెలుగు మీడియం), బి.కామ్(ఇంగ్లీష్‌మీడియం), బిఎస్సి(ఇంగ్లీష్‌మీడియం, తెలుగు మీడియం)కోర్సులకు మిగిలినసీట్లకు అర్హతకలిగిన అభ్యర్థులు తమ డాక్యుమెంట్లతో కళాశాలకు హాజరుకావాలన్నారు. విద్యార్థులు ఎస్‌ఎస్సి మార్క్స్ మెమో, ఇంటర్‌మెమో, ట్రాన్స్ఫర్‌సర్టిఫికెట్, కులంసర్టిఫికేట్(లేటెస్ట్), ఆదాయ సర్టిఫికేట్(లేటెస్ట్), నివాససర్టిఫికేట్, ఆధార్‌కార్డ్, మొబైల్‌నెంబర్, అన్ని బోనఫైడ్స్, ఫోటో, సిగ్నేచర్‌తో కళాశాలలో సంప్రతించాలన్నారు. అధిక సమాచారం కోసం కళాశాల సంప్రతించండి: 9000958212.

# లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

**-రాజీయే రాజమార్గం**
**-లోక్ అదాలత్‌లో తీర్పు అంతిమతీర్పు**
**-జూనియర్ సివిల్ జడ్జ్ ఎం. హేమలత**




లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జ్ న్యాయమూర్తి ఎం.హేమలత, తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
లోక్ అదాలతో ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని పేర్కొంటూ ఇందుకు రాజీ పడటమే రాజమార్గమని జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ న్యాయమూర్తి ఎం.హేమలత పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్‌లోని కోర్టులో మెదక్ జిల్లా నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ నర్సాపూర్ న్యాయమూర్తి ఎం.హేమలత మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. ఈ లోక్ అదాలత్ ఇచ్చినతీర్పు అంతిమ తీర్పు అని తెలియజేశారు. ఈమేరకు కక్షిదారులు గ్రామీణ ప్రాంతాల్లో క్షణికావేశంలో ఇరువర్గాలు తగదాలు పడి కోపతాపాలు పెంచుకొని పరస్పరం కేసులు నమోదు చేయించుకొని కోర్టుచుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో తమ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారాని అన్నారు. ఇందుకోసం కక్షిదారులు రాజీ చేయదగ్గ కేసులలో ఇరు వర్గాలు వారు జాతీయ లోక్ అదాలత్‌కు హాజరై తద్వారా రాజీ కుదుర్చుకొని రాజీపడి కలిసిమెలిసి ప్రేమానురాగాలతో ఉండడమే ఉత్తమమని అన్నారు, ఈకార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.రాఘవేందర్, ప్రభుత్వ సహాయ న్యాయవాది పి.సుధాకర్, లీగల్ సర్వీసెస్ న్యాయవాది బి.స్వరూపరాణి, లీగల్ సర్వీస్ బెంచ్ మెంబర్ మధు శ్రీశర్మ, సీనియర్ న్యాయవాది ఇక్బాల్ జాఫర్, న్యాయవాదులు ఎ.శ్రీనివాస్, ఈ.సత్యనారాయణ, నాగరాజు, కె.రాజునాయక్, ఎండి.ఆరిఫ్, ఎ.సాయిరాం, జె.రవినాయక్, కోర్టు సిబ్బంది, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ సిబ్బంది, పోలీస్ కోర్ట్ కానిస్టేబుల్స్, కక్షిదారులు పాల్గొన్నారు.

## ప్రతాప్‌రెడ్డిని పరామర్శించిన ఈటల రాజేందర్



వజ్రమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపి ఈటల రాజేందర్

**జగదేవ్‌పూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
బిఆర్‌ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాతృమూర్తి వంటేరు వజ్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయంతెలుసుకున్న మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ శనివారం జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామంలోని ప్రతాప్‌రెడ్డి స్వగృహానికివచ్చి ప్రతాప్‌రెడ్డితోపాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వజ్రమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయనవెంట బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్, జగదేవ్‌పూర్ మండలపార్టీ అధ్యక్షుడు దాసరి ఐలయ్యయాదవ్, సీనియర్ నాయకులు శ్రీధర్, బుద్ద మహేందర్, ఐలయ్య, లక్ష్మణ్‌గౌడ్, కుమార్, బీమరి గణేష్, రాజ్ కుమార్, నర్ర నర్సింలు, హరికృష్ణచారి తదితరులు ఉన్నారు.

## తైబజార్ రద్దుతో చిరువ్యాపారులకు ఊరట

**-ఎమ్మెల్యే రోహిత్‌రావు ఫ్లెక్సీకి పాలాభిషేకంతో కృతజ్ఞత**

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపాలిటీ తైబజార్ రద్దుతో చిరువ్యాపారులు సంతోషం వ్యక్తంచేశారు. శనివారం స్థానిక చిరువ్యాపారులు, రైతులు, కూరగాయల వ్యాపారులు కలిసి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు చిత్రపటానికి పాలాభిషేకంచేశారు. మున్సిపాలిటీపరిధిలో తైబజార్ వసూలును నిలిపివేసినట్లు అధికారికంగా ప్రకటించడంతో, అప్పటివరకు ఆర్థికభారం ఎదుర్కొంటున్న ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. తమ సమస్యను గుర్తించి, తక్షణమే పరిష్కారం అందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతగా ఈప్రత్యేకకార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

## మాసాయిపేటలో చోరీ
## సిసి కెమెరాల్లో రికార్డు

**వెల్దుర్తి, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
మాసాయిపేట మండలంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని ఒక వ్యక్తి గ్రామంలోని లాండ్రీషాప్ తలుపులు ధ్వంసం చేసి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. అలాగే పక్కన ఉన్న కిరణ్ షాపులో సైతం చోరీకిపాల్పడి దొంగలు నగదును ఎత్తుకెళ్లినట్టు బాధితులు తెలిపారు. అనంతరం సాయిబాబా దేవాలయం వద్ద తాళాలు ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా ఆవీడియో సిసి కెమెరాలో రికార్డు అయింది. ఈవిషయం పోలీసులకు తెలపడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న కాంగ్రెస్ సర్కార్

**-విలేకరులతో ఎబివిపి రాష్ట్రకార్యదర్శి మాచర్ల రాంబాబు**

**జహీరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తోందని అఖిలభారత విద్యార్థిపరిషత్ రాష్ట్రకార్యదర్శి మాచర్ల రాంబాబు దుయ్యబట్టారు. శనివారం జహీరాబాద్ పట్టణంలో స్థానిక సిద్దార్థ పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రబడ్జెట్‌లో 40శాతం విద్యారంగానికి నిధులు కేటాయించినట్లు పేర్కొనడం పచ్చి అబద్ధమని, 40శాతం నిధులు కేటాయిస్తూ రంగాలవారీగా శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. అధికారంలోకి వస్తే ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీచేసి అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా కేవలం 37500 ఉద్యోగాలు మాత్రమే భర్తీచేసి నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని దుయ్యబట్టారు.

**గ్రూప్-1 ఫలితాలపై సిబిఐ విచారణ చేపట్టాలి...**
రాష్ట్రంలో ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన గ్రూప్-1 ఫలితాలపై పరీక్షలు రాసిన అభ్యర్థులలో తీవ్ర అనుమానాలు ఉన్నందున ప్రభుత్వం వెంటనే సిబిఐ విచారణకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 ఫలితాలలో ముఖ్యమంత్రి బంధువులు, అన్నదమ్ములు, మంత్రులకు 500పైగా అభ్యర్థులనుంచి కోటి రూపాయలకు పైగా ముడుపులుతీసుకుని వారికి ఉద్యోగాలు కట్టబెట్టాలని ప్రభుత్వంచూస్తోందని ఆరోపించారు. ప్రభుత్వయూనివర్సిటీ భూములను అమ్ముకుంటూ ప్రయివేట్‌యూనివర్సిటీలకు వత్తాసు పలుకుతుందని మండిపడ్డారు. ప్రయివేట్ జూనియర్ డిగ్రీకళాశాలలకు బకాయిలు చెల్లించకుండా యూనివర్సిటీలకు కమిషన్లు తీసుకుని స్కాలర్‌షిప్ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తోందని ఆరోపించారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి కళాశాలలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో ఎబివిపి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ ఆకాష్, సంగారెడ్డి జిల్లా కన్వీనర్ రాజేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రవీణ్, రాష్ట్ర అగ్రివిజన్ కన్వీనర్ మానస, సిద్దిపేట కన్వీనర్ ఆధిత్య తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

**-సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి**

**జహీరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.కవితాదేవి పేర్కొన్నారు. సీనియర్ కోర్టు విభాగంలో 89 బ్యాంక్ పియల్సి కేసులు, 14 సైబర్ క్రైమ్ కేసులు, 6 సివిల్ కేసులు పరిష్కారం కాగా 89 లక్షల 08వేల 130 రూపాయలను వసూలు అయ్యాయన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ కోర్టు, ఏడియం కోర్టు విభాగాలలో 8క సివిల్ కేసులు, 44 క్రమినల్ కాంపౌండ్ కేసులు, 37 అడ్మిషన్ కేసులు, 9 ఎక్సైజ్ కేసులు పరిష్కారం అయి 64500 రూపాయలు వసూలు అయ్యాయన్నారు.

## జాతీయ పునర్నిర్మాణంలో
## యువత భాగస్వామ్యం కావాలి

**-ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు**

**జహీరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
జాతీయ పునర్నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. శనివారం పట్టణంలోని సిద్దార్థ హైస్కూల్‌లో ఎబివిపి మెదక్ విభాగ్ అభ్యాస వర్గ ప్రారంభం కార్యక్రమంలో రాంబాబు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి మహంత్ సిద్దేశ్వర నందగిరి మహారాజ్, ఎబివిపి మెదక్ విభాగ్ కన్వీనర్ ఆకాష్, కార్యదర్శి అక్షణ్, జిల్లాప్రముఖ్ మాధవరెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కన్వీనర్లు రాజు, ఆదిత్య, అగ్రివిజన్ రాష్ట్ర కన్వీనర్ మానస, రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్ ఉదయ్‌సాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేష్, ప్రసాద్, ఎబివిపి పూర్వ కార్యకర్తలు దత్తాత్రి జగన్నాథ్, మహిపాల్‌రెడ్డి, విశ్వనాథ్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, ఆనంద్, ఈశ్వర్, నరేష్, సాయిలు, నవీన్, శ్రీనివాస్, తుక్కప్ప, ఆంజనేయులు, బస్వరాజ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 4334 కేసులు పరిష్కారం

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర**

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కోర్టు ఆవరణలో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికారసంస్థ ఆదేశాలమేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సౌజన్యంతో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి.భవానిచంద్ర పేర్కొన్నారు. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 3850 క్రిమినల్ కేసులు, 22సివిల్ కేసులు, 21మోటారు వాహన ప్రమాద కేసులు, 40 ప్రీలిటిగేషన్ కేసులు, 58బ్యాంక్ రికవరీకేసులు, 105సైబర్‌క్రైమ్‌కేసులు, 238విద్యుత్‌చౌర్యం కేసులు పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రత్యేకన్యాయమూర్తులు కె.జయంతి, జి.సునీత, లావణ్య, బి.సౌజన్య, దీప్తి, అనిత, న్యాయమూర్తి కె.ధనలక్ష్మి, టి.దుర్గారాణి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభుధాన్యం, సత్యనారాయణ, జిల్లా రెవిన్యూ అధికారి పద్మజారాణి, డిసిపి సత్తయ్య, న్యాయవాదులు, పోలీసులు బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.